

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 39 | ఆదివారం 08 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3

## ఏపీ పదో తరగతి పరీక్షలు...

ఏపీ పదో తరగతి ఇంగ్లీషు పరీక్ష తేదీలో మార్పు

పండుగల నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పు చేసిన విద్యాశాఖ

మార్చి 20కి బదులుగా 21న ఇంగ్లీషు పరీక్ష నిర్వహణ

మిగిలిన పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టీకరణ

## ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర



2లో

పథకాన్ని నీరుగారుస్తున్న కేంద్ర బీజేపీ - ఏపి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

## ఆధిపత్య పోరు కావాలా.. అభివృద్ధి కావాల?

తూప్రాన్‌లో నేతల గొడవలతో అభివృద్ధి వెనక్కు

మున్సిపల్ ప్రచారంలో హరీష్ రావు విమర్శలు

2లో



## దేశ ప్రగతిని చాటేలా కేంద్ర బడ్జెట్

భవిష్యత్ దిక్సూచిగా ప్రతిపాదనలు బడ్జెట్‌పై చర్చలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

2లో






2లో

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు

## మోగిన నగారా..

ఆంధ్ర ప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. గ్రామపంచాయితీ ఎన్నికల కోసం ఓటర్ జాబితాలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం, రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన వార్డు వారీ ఫోటో ఓటరు జాబితాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీ కాలం గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. దీంతో ఆయా చోట్ల ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు కసరత్తులు ప్రారంభించింది. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే నెల 9కి ఓటర్ లిస్ట్ రెడీ చేయాలని సూచించింది. అయితే రాష్ట్రంలో జనగణన ఉండటంతో అది పూర్తి అయిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలో ఓటర్ల జాబితాపై ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. 2026 జనవరి ఒకటిని అర్హత తేదీగా తీసుకుని అసెంబ్లీ ఓటరు జాబితాలను ఆధారంగా చేసుకుని ఈ జాబితాలు తయారు చేయాలని ఆదేశించింది.



అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన

ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య

క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా

హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా, దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన

ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి

2లో

# క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్

# దేశానికి గేమ్ ఛేంజర్

"ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చు కోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.



## చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులు

ఐదేళ్లు నిద్రపోయి ఇప్పుడు వైసీపీ ఉద్యమాలు చేయడమేంటని షర్మిల ప్రశ్న

సంగమేశ్వరం బదులు ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కట్టడంపై అభ్యంతరం

స్వప్రయోజనాల కోసం సీమ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపణ

2లో

## శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు...

## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు...

2లో



బురద రోడ్డుపై విద్యార్థుల ఆవేదన.. సోషల్ మీడియాలో వీడియో

వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు

కూటమి ప్రభుత్వంలో ఉదయగిరిలో రూ.55 కోట్ల రోడ్ల పనులు

ఈ రోడ్డు మంజూరుతో విద్యార్థులు, రైతుల కష్టాలకు తెర

# ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు మోగిన నగారా..

ఇలా తయారు చేసిన ఓటరు జాబితాలను మార్చి 9న అధికారికంగా ప్రచురించబోతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ దృష్ట్యా ఈ ప్రక్రియ చేపట్టబడుతున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఈ లెక్కన మార్చి 9న ఓటరు జాబితాల్ని ప్రచురిస్తే..ఆ తర్వాత ఏ క్షణంలో అయినా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. నియోజకవర్గాల పునర్విభజన, జనాభా గణనతో వీటికి ఎలాగో సంబంధం లేదు కాబట్టి ఈ ఏడాదిలోనే ఈ ఎన్నికల నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో అధికార పక్షమైన కూటమి ప్రభుత్వంతో పాటు ప్రతపక్ష వైసీపీ మెజారిటీ స్థానాలు కైవసం చేసుకునేందుకు ఇప్పటి నుంచే వ్యూహ ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు.

## సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు...

“పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి“ అంటూ విద్యార్థులు చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జలవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జలవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి. ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పటికే ‘పల్లెపండగ 1.0, 2.0‘, సాస్కి నిధులతో కలిపి సుమారు రూ. 55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టుల కింద మొత్తం 641 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటికి అదనంగా, తాజాగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గజ్జలవారిపల్లి రోడ్డును ప్రత్యేకంగా మంజూరు చేయడం గమనార్హం.

## చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే: షర్మిల

ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. స్వప్రయోజనాల కోసం సీమ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇద్దరూ నాటకాలు ఆడారని ఆమె ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ఇరువురు నేతల వైఖరిని ఆమె తప్పుబట్టారు. వైసీపీ ప్రభుత్వంపై షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. “గత ఐదేళ్ల పాలనలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అంశంలో నిద్రపోయిన వైసీపీ, ఇప్పుడు ఓటమి తర్వాత ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు“ అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్జీటీ వద్ద బలమైన వాదనలు వినిపించకుండా, కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాకుండా ఇప్పుడు ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు. “ఐదేళ్లు ప్రధాని మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్‌కు అప్పుడు సీమకు నీళ్లివ్వాలని గుర్తుకురాలేదా?“ అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, సీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆమె విమర్శించారు. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు సంగమేశ్వరం వద్ద కాకుండా ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పడాన్ని కూడా షర్మిల తప్పుబట్టారు. “ఎవరిని మోసం చేయడానికి ఇద్దరూ కలిసి ఈ నాటకాలు ఆడుతున్నారు? మోదీ దగ్గర సాగిలపడి సీమకు అన్యాయం చేస్తారా?“ అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. ఇద్దరు నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని, సీమ ప్రయోజనాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

# ములుగు పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం..

**7వ వార్డు అభివృద్ధియే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నాం...**

**ములుగు నియోజకవర్గ అభివృద్ధియే సీతక్క ప్రధాన లక్ష్యం...**

**అధికార పార్టీకి ఓటు ఓటు వేయండి - అభివృద్ధికి బాటలు వేయండి...**

**7వ వార్డులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తాం..**

**వీధులన్నీ సీసీ రోడ్లు చేసి, డ్రైనేజీలని ఏర్పాటు చేస్తాం...**

**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 7( నంది పత్రిక)** శనివారం ములుగు పట్టణ కేంద్రంలోని మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 7వ వార్డు అభ్యర్థి వంగ సుమలత – రవి యాదవ్ చేతి గుర్తుకి ఓటు వెయ్యాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ ఇంటింటి ప్రచారం నిర్వహించి, తమ అమూల్యమైన ఓటును చేతి గుర్తుకు వేసి, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరుతూ గడప, గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి అని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే మంత్రిగా మన ఆడబిడ్డ సీతక్క, ములుగు గ్రామ పంచాయతీని మున్సిపల్ చేసింది అని, గిరిజన విశ్వ విద్యాలయానికి స్థలాన్ని కేటాయించి గిరిజన విద్యాలయ తరగతులు ప్రారంభించారు అని, ములుగు పట్టణంలో అంతర్గత రోడ్లు, పత్తిపల్లి రోడ్డుకు సెంట్రల్ లైటింగ్, డబుల్ రోడ్డును మంజూరు చేశారని, ములుగు పట్టణ కేంద్రంలో అధునాతన బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నారని, అలాగే నిరుద్యోగ వ్యవస్థను రూపుమాపడానికి ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ కర్మాగారం ఏర్పాటు చేపిస్తున్నారని, టాస్క్ ద్వారా గ్రామంలో పేద విద్యార్థులకు శిక్షణ అందించి, ఐటీ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తున్నారని అని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే ములుగు పట్టణ కేంద్రంలో రోడ్లు వెడల్పు చేసి, అన్ని విధుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేసి అధునాతన పట్టణ కేంద్రంగా తీర్చిదిద్దుతాం అని, మంత్రి సీతక్క దగ్గరి నుండి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఏడవ వార్డును అభివృద్ధి చేస్తారని, కాంగ్రెస్ పార్టీ 7వ వార్డు అభ్యర్థి వంగ సుమలత – రవి యాదవ్ కి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని, గెలిచిన వెంటనే వర్షం పడగానే మురికి నీరు ఇంట్లోకి రాకుండా డ్రైనేజ్ వ్యవస్థను తీసుకొస్తారని, అలాగే యువత కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తారని, ఉద్యోగ మేళా ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని, వీవర్స్ కాలనీ నందు కళాతోరణం నిర్మిస్తారని, పద్మశాలి కమ్యూనిటీ హాల్ నందు వంట గది కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తారని హామీ ఇస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి వారిని గెలిపించగలరని వేడుకుంటూ ఎన్నికల ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



# ములుగు మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరవేస్తాం..

**ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 7( నంది పత్రిక )** ములుగు జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ఇంచార్జ్ మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ మరియు ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి ములుగు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ జెండాయి ఎగరవేయటం ఖాయమని ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు అన్నారు ములుగు జిల్లా ఇచ్చింది కేసీఆర్ ములుగు జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి పథంలో ఉంచింది బిఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా ఇచ్చిన తర్వాత జిల్లా కలెక్టరేట్ ములుగు పోలీస్ సూపరింటెంట్ కార్యాలయాన్ని ప్రభుత్వ హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందించడంలో కెసిఆర్ ప్రభుత్వం ఎంతో చేసిందని ములుగు అభివృద్ధి చెందడం కోసం గిరిజనుల కోసం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసింది కూడా కేసీఆర్ ప్రభుత్వమే అని ఈ సందర్భంగా గుర్తు చేశారు జిల్లా కేంద్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఈ ములుగు జిల్లాకు కేసిఆర్ అందించారు ములుగు జిల్లాను అభివృద్ధి పథంలో ముందించింది ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని రాబోయే రెండున్నర సంవత్సరంలో మళ్లీ కేసిఆర్ ముఖ్యమంత్రి అవ్వటం ఖాయం ములుగు జిల్లాను మరింత అభివృద్ధి పదంలో ముందుకు తీసుకువెళ్లే బాధ్యత ఇక్కడ బిఆర్ఎస్ నాయకులు తీసుకుంటామని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు ఇంటింటి ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారని తప్పకుండా బిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వాన ములుగు మున్సిపాలిటీ పై గులాబీ జెండా ఎగరవేస్తామని కాకులమర్రి లక్ష్మణ్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఇన్చార్జి మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ములుగు మేధావులు ఓటర్ మహాశయులు రెండు సంవత్సరాల పరిపాలనలో ఏమి జరిగిందో ఆలోచించండి! ఈ ములుగు జిల్లా ఇచ్చింది కేసీఆర్, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది అందుకే మున్సి పాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి రాబోయే రెండు నెలలు మరింత అభివృద్ధి చేసుకుందాం అని ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రజలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్ మల్కా రమేష్ తాటి కృష్ణ ములుగు మండల పార్టీ అధ్యక్షులు సాని కొమ్ము రమేష్ రెడ్డి టౌన్ అధ్యక్షులు చేన్న విజయ్ కుమార్, కోగిల మహేష్, వేములపల్లి బిక్షపతి కౌన్సిలర్ అభ్యర్థులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



# నాంపల్లి అగ్నిప్రమాదం.. డీసీపీ స్పందన ఇదే.?

హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం (చీఱవఙఝశ్రీశ్రీఎ ఖీఱతీవ-ూాషఔఱవత్) జరిగింది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కీలక పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. అయితే ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి.. హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి(ఱజూ ాాష్ట్రఱశ్రీఝఝఝశ్రీశ్రీఱ) మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు. ఈరోజు ఉదయం 10:00 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె వెల్లడించారు.

**మంటలను పూర్తిగా అదుపు చేశాం..** 5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు.

**విలువైన హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతి: డీఎఫ్ఓ శ్రీ దాస్** తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీ దాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. ఇవాళ ఉదయం 10:22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు.హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా? పాక్షికంగా కాలాయా? అన్నది పరిశీలించాలని డీఎఫ్ఓ తెలిపారు.




# ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిన మహాత్మా గాంధీ జాతి ఉపాధి హామీ పథకం చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తుందని,పేదల కడుపు కొట్టేందుకే పథకం పేరు మార్చి 125 రోజులు పెంచుతున్నట్లు బూటకపు మాటలు చెబుతున్నారని తెలిపారు. 8 గంటల ఉన్న పనిని 12 గంటలు చేశారని, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం,కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తామని చెప్పడం పేద ప్రజలకు ద్రోహం చేసినట్లు కాదా అని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ఆచరణలో పెట్టాయని తెలిపారు.గ్రామాలలో గుడులు, బడులు లేకపోయినా బెల్ట్ షాపులు మాత్రం అధికంగా ఉన్నాయని,రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని,రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యంతో ఉందని తెలిపారు.మళ్లీ మన అందరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అటు దేశం అభివద్ధి పథంలో దూసుకుపోతుందని వైయస్ షర్మిల తెలియజేశారు.పై కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు,కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ మావుడూరు వెంకటాచలపతి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జీలు, మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆధిపత్య పోరు కావాలా.. అభివృద్ధి కావాల?

తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. నర్సారెడ్డి, మైనంపల్లి మధ్య ఆధిపత్యం కోసం ప్రజలను బలి చేస్తున్నారని మండిపడ్డారు. మీకు ఆధిపత్య రాజకీయాలు కావాలా? లేక అభివృద్ధి కావాలా? ఆలోచించండని ప్రజలకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తూప్రాన్‌లో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా అల్లాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు ప్రసంగించారు. అక్కడి నుంచి తూప్రాన్ బస్టాండ్ వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. తూప్రాన్ అభివృద్ధిని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు. ఒకప్పుడు తూప్రాన్‌లో మంచినీళ్లు కావాలంటే మూడు రోజులకోసారి వచ్చేవని.. గీతారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బిందెలతో అడ్డం పడి నిరసన తెలిపేవాళ్లు అని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ కేసీఆర్ వచ్చాక ప్రతి ఇంటికి నల్లా పెట్టి ఆడబిడ్డలకు నీటి కష్టాలను తీర్చారని తెలిపారు. తూప్రాన్‌ను మున్సిపాలిటీ చేసింది, ఆర్డీవో ఆఫీస్ తెచ్చింది, ఫోర్ లైన్ రోడ్లు వేసి హైవేలా మార్చింది కారు గుర్తు కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ రాకముందు తూప్రాన్‌కు పిల్లనియ్యాలంటే నీళ్లు మోపిస్తారని భయపడేవాళు .. కానీ ఇప్పుడు తూప్రాన్‌కే పిల్లనియ్యాలన్నట్టు పరిస్థితి మారిందని అన్నారు. పది లక్షలు లేని భూమిని కోటి రూపాయలు చేసింది కేసీఆర్. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు పాతాళానికి, బంగారం ధరలు ఆకాశానికి చేరాయని హరీశ్‌రావు అన్నారు. రెండేళ్ల నుంచి తూప్రాన్ అభివృద్ధిని అడ్డుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. రోడ్లకు గుంతలు పడితే డాంబర్ వేసే దిక్కు కూడా ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ?కేసీఆర్ ఉన్నప్పుడు పంట పంటకు రైతుబంధు పడేది. కరోనా కష్టకాలంలో కూడా ఆపలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి రెండు రైతుబంధులు ఎగ్గొట్టాడన్నారు. బతుకమ్మ చీరలు బంద్, కేసీఆర్ కిట్ బంద్, గొర్రెల పంపిణీ బంద్, చేప పిల్లలు బంద్, దళిత బంధు బంద్.. అన్నీ బంద్ పెట్టి ప్రజలను గోస పెడుతున్నాడని పేర్కొన్నారు. సద్ది తిన్న రేవు తలవాలి.. మనకు అన్నం పెట్టిన కేసీఆర్ ను మర్చిపోవద్దని అన్నారు.

?బీజేపీ వాళ్లు ఓట్ల కోసం గిర్ర గిర్ర తిరుగుతున్నారని. వాళ్లు తూప్రాన్‌కు ఏమైనా చేశారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఒక్క హాస్పిటల్ కట్టించారా? కల్యాణ లక్ష్మి ఇచ్చారా? రూ. 15 లక్షలు వేస్తామని 12 ఏళ్లుగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు ఇవ్వలేదన్నారు. పువ్వు గుర్తుకు ఓటేసినా, ఓటును మోరీలో పారేసినా ఒక్కటే. అది దండుగ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డికి కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అని అడిగితే లాగుల తొండలు వేస్తా అంటాడని.. హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడని.. తులం బంగారం ఏది అంటే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని అన్నారు. ఇది ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా? ఇలాంటి బూతుల ముఖ్యమంత్రికి ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ?ఐదేళ్ల కోసం కౌన్సిలర్లను గెలిపించాలని సూచించారు. రెండేళ్ల తర్వాత వచ్చేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. తూప్రాన్ అభివృద్ధి బాధ్యత నాది. ఏ పని ఉన్నా నేను చేసి పెడతా అని హామీ ఇచ్చారు.

# దేశ ప్రగతిని చాటేలా కేంద్ర బడ్జెట్

బడ్జెట్ ప్రజలకు మేలుచేసేదిగా, దేశ అభివృద్ధికి దోహదపేడిగా ఉందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం కేంద్ర బడ్జెట్ 2026–27పై మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బ్జడెట్ ఎన్నికల బ్జడెట్ కాదని, రాజకీయాలు పక్కనపెట్టి 140 కోట్ల మంది భారతీయుల కోసం బ్జడెట్‌ను ప్రవేశపెట్టారని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. 2014కు ముందు ప్రపంచంలో అత్యంత బలహీన దేశాల్లో భారత్ ఒకటిగా ఉండేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇప్పుడు నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదో సారి బ్జడెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. 7 శాతం వృద్ధి రేటు సాధించేందుకు తయారీ రంగంపై ప్రధానంగా దృష్టి పెట్టారని అన్నారు. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించేందుకు ఏపీకి కేంద్రం సహకరిస్తుందని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని.. ప్రపంచ దేశాలు భారత్‌తో కలిసి పనిచేయడానికి ముందుకు వస్తున్నాయని కేంద్రమంత్రి వెల్లడించారు. తంవ్యాప్తంగా 74 ఎయిర్‌పోర్టులు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 164కు పెంచామని కేంద్రమంత్రి చెప్పారు. విమానాల తయారీకి బ్జడెట్‌లో అవకాశాలు కల్పించామని తెలిపారు. ఏపీలో తాగునీటి అవసరాల కోసం రూ.840కోట్లు కేటాయించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం రూ.13 వేల కోట్లు కేంద్రం కేటాయించిందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 52 ఎకరాల భూమి కేటాయించిందని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కేంద్రమంత్రి చెప్పారు. 2026 బ్జడెట్‌లో ఏపీకి అనేక కేటాయింపులు జరిగాయన్నారు. ఏపీలో నూతన రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.10,134 కోట్లు ప్రకటించారని, అమరావతి కోసం రూ.1,120 కోట్లు కేటాయించారని వివరించారు. అమరావతిలో ఇప్పుడు 24 గంటలూ పనులు జరుగుతున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. హకారంతోనే గత 20 నెలల్లో కూటమి ప్రభుత్వం అనేక విజయాలు సాధించిందన్నారు. ఈ విజయాలు మరో 20 సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షించారు. 'పండ్లు కాసే సమయంలో కసాయి వాడికి అప్పగించవద్దు' అని అన్నారు. రాష్ట్రానికి బలమైన పునాదులు పడుతున్నాయని వ్యాఖ్యానించారు. గతంలో రాజధాని అంటే చెప్పుకోలేకపోయామన్నారు రామ్మోహన్ నాయుడు. పోలవరాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు కేంద్రం నిధులు ఇస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.13 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందన్నారు. ఇటీవల జనవరిలో విశాఖ స్టీల్ ఎ÷–లాంట్ తొలిసారిగా రూ.52కోట్ల లాభాలు సాధించిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం.

తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, “భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం“ అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామికి పంగనామాలు పెట్టిన గత వైసీపీ ప్రభుత్వం..

**హిందువులను వెర్రోళ్లను చేసిన వైవి సుబ్బారెడ్డి......**
**లడ్డు కల్తీ గాళ్ళకు శిక్ష పడాలని వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు....**
**గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుకు పాపప్రక్షాళన చేసుకోవాలి ,.....**
**లడ్డు కల్తీ పై వైసీపీ దుష్ప్రచారాన్ని ఖండించిన, నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురు...**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 7 ( నంది పత్రిక ) తిరుమల పవిత్రతను సంరక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు వైసీపీ నాయకులు గుండు కొట్టించుకొని వైసీపీ గత ప్రభుత్వం చేసిన తప్పుకు పాపప్రక్షాళన చేసుకోవాలి మారాసు గురు బాబుపవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల దేవస్థానంలో 2019 నుండి 2024 వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డును వైసిపి ప్రభుత్వం కల్తీ చేసినందుకుగాను పాప ప్రక్షాళనకు నంద్యాల జనసేన నాయకులు మారాసు గురు బాబు ఆధ్వర్యంలో గుడిపాటి గడ్డలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రాంగణాన్ని శుభ్రం చేసిన అనంతరం జనసేన నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మా రా సు గురుబాబు మాట్లాడుతూ కోట్లాదిమంది ఆరాధ్య దైవంగా భావించే శ్రీ వెంకటేశ్వర స్వామి స్వయంభూగా వెలిసిన తిరుమల పవిత్ర క్షేత్రాన్ని కేవలం అక్రమ సంపాదన కోసం గత వైసిపి ప్రభుత్వం లోని టీటీడీ బోర్డు లోని అధ్యక్షులు ,కొందరు సభ్యులు, మరికొందరు అవినీతి అధకారులు స్వయంగా శ్రీ వెంకటేశ్వర స్వామికి పంగనామాలు పెట్టారు తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి వైసిపి నాయకులు దొంగ పూజల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అలజడులు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు పరమ పవిత్రమైన తిరుపతి పుణ్యక్షేత్రాన్ని అవినీతి మయంగా మార్చిన వై వి సుబ్బారెడ్డి హిందువులను వెర్రోళ్లను చేస్తూ కోట్ల రూపాయలనుదండుకున్నారు తిరుమల పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం చేసిన ఈ లడ్డు కల్తీ గాళ్ళకు చట్టపరంగా శిక్షలు పడాలని పురాతన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుద్ధిచేసి పూజలు నిర్వహించాము నిజంగానే నంద్యాలలో వైసిపి నాయకులకు వెంకటేశ్వర స్వామి పై భక్తి ఉంటే గత వైసిపి ప్రభుత్వం తిరుమల పుణ్యక్షేత్రాన్ని ధనార్జనే ధ్యేయంగా అపవిత్రం చేసినందుకు గుండు కొట్టించుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాలని హితవు పలికారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరుమల క్షేత్రాన్ని ఎంతో అభివృద్ధి ప్రధాన నడిపిస్తూ భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తుంది అంతేకాకుండా తిరుమల పవిత్రతను కాపాడేందుకు అన్ని రకాల చర్యలను తీసుకుంటూ ఆదర్శంగా నిలుస్తుంది ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కిషోర్ నాయుడు, వీర మహిళ సంఘ జయంతి,జనసైనికులురవి ,శ్రావణ్ ,సుధీర్,సుమన్ ,గోపాల్ ,మహేష్ ,దినేష్ తదితరులు పాల్గొన్నారు....



## శ్రీ పెద్దమ్మపోలేరమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం చండీ హోమంతో ఆధ్యాత్మిక కార్యక్రమం





కలసపాడు, ఫిబ్రవరి 7 (నంది పత్రిక):కలసపాడు మండలంలో శ్రీ పెద్దమ్మ, పోలేరమ్మ, సత్యమ్మ, ఎల్లమ్మ, శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రమణ్యస్వామి, నాగదేవత, పోతురాజు ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చండీ హోమము కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలతో కలిసి పురోహితుడు వారణాసి వెంకటరమణయ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో పరవశించింది. హోమ కుండంలో అగ్ని ప్రజ్వలింపజేసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దేవతల ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ శాంతి, సుభిక్షత, ప్రజల ఆరోగ్యం కోసం ఈ చండీ హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు.

# రిజిస్ట్రేషన్ శాఖకు మంచి పేరు తీసుకురండి

**ప్రజలతో మంచి సేవలు అందించండి**
**డబ్బు లు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి**

కర్నూలు , నంది పత్రిక.....ప్రజలకు మంచి సేవలు అందించి రిజిస్ట్రేషన్ శాఖ కు మంచి పేరు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు.శనివారం ఉదయం కలెక్టరేట్ నుండి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులతో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ప్రజల్లో మంచి అభిప్రాయం లేదని ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ ద్వారా తెలుస్తోందన్నారు. రిజిస్ట్రేషన్ డిజిటల్ విధానంలో ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్ సౌకర్యం ద్వారా చేసుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..డాక్యుమెంట్ రైటర్స్ దగ్గర కానీ మధ్యవర్తుల దగ్గరకు కానీ వెళ్ళకుండా వారికి రిజిస్ట్రేషన్ సౌకర్యం స్లాట్ బుకింగ్ ద్వారా పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలు ఇతరుల చేతిలో మోసపోకుండా , అధిక మొత్తంలో డబ్బులు చెల్లించకుండా రిజిస్ట్రేషన్ చార్జెస్ ను నోటీసు బోర్డులో ఉంచి వారికి పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో కోసిగి , ఆస్పరి , నందవరం , మంత్రాలయం తదితర మండలాలలో సేవలు సరిగా లేవని, అనధికారికంగా డబ్బులు తీసుకుంటున్నారని ఫిర్యాదులు ఉన్నాయని, ఇప్పటినుండి ఇలాంటి ఫిర్యాదులు వస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో విఆర్వోలు , విలేజ్ సెక్రటరీలను సస్పెండ్ చేయడం జరిగిందని, కావున ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారి దగ్గర నుండి డబ్బులు తీసుకోకుండా రిజిస్ట్రేషన్ సేవలు అందించి జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖకు మంచి పేరు తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖలో జరిగే గిఫ్ట్ డీడ్, పార్టిషన్, ట్రాన్స్ఫర్, మార్టుగేజ్ తదితర రిజిస్ట్రేషన్ ప్రక్రియల గురించి చిన్న వీడియోలను తయారుచేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పాంప్లెట్లు తయారు చేసి అన్ని ప్రదేశాల లో పిజిఆర్ఎస్ లు జరుగుతున్న సమయాల్లో ప్రజలకు అందించాలన్నారు. ప్రతి పది రోజులకు ఒకసారి రిజిస్ట్రేషన్ సేవల గురించి స్థానిక దినపత్రికలలో వచ్చేలాగా ప్రెస్ నోట్ లు ఇవ్వాలని , రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు రిజిస్ట్రేషన్ పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పది రోజులకు ఒక సారి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ లు చేసి సేవలు బాగా అందించే చర్యలు తీసుకోవాలని డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ను ఆదేశించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ కు సంబంధించి ఏవైనా సాంకేతిక సమస్యల ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని, వాటిని విజయవాడ కమీషనరేట్ కు తెలిపి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ భార్గవ్, జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు.




## స్టేట్ లెవెల్ సైన్స్ ఒలంపియాడ్ లో గోల్డ్ మెడల్ సాధించిన గురు రాజా విద్యార్థులు





నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 7 ( నంది పత్రిక ) హైదరాబాదుకు చెందిన సుచిర్ ఇండియా ఫౌండేషన్ వారి చే నిర్వహించబడిన సివి రామన్ సైన్స్ ఒలంపియాడ్ లో నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు గోల్డ్ మెడల్ తో పాటు 14 మంది విద్యార్థులు స్టేట్ మరియు డిస్టిక్ ర్యాంకులు సాధించినట్లుగా లిస్కూల్ డైరెక్టర్ పి షేక్షావల్లి రెడ్డి తెలిపారు. లిహైదరాబాద్ మహానగరం రవీంద్ర భారతి లో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి “లిమాజీమంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు , శాసనసభ సభ్యులు చింతమనేని ప్రభాకర్, ప్రముఖ సినీ నటులు శ్రీకాంత్ ,శివాజీ రాజా చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. ఏడో తరగతి విభాగంలో పి. సరయు గోల్డ్ మెడల్ తోపాటు నగదు పారితోషకాన్ని అందుకున్నది. సరయు వరుసగా నాలుగోసారి గోల్డ్ మెడల్ అందుకోవడం విశేషం. మూడో తరగతి విభాగంలో ఎం.ప్రమోద్ రెడ్డి ఫస్ట్ ర్యాంక్, నాలుగో తరగతి విభాగంలో పి .ఇషాన్ రెడ్డి డిస్టిక్ లెవెల్ ఫస్ట్ ర్యాంక్, యు.ఏకనందిత సెకండ్ రాంక్, ఐదో తరగతి విభాగంలో కే.చంద్రశేఖర్ డిస్టిక్ లెవెల్ ఫస్ట్ ర్యాంక్ , ఏం .లిఖిత్ సెకండ్ ర్యాంక్,,ఆరో తరగతి భాగంలో ఏం.తేజస్విత డిస్టిక్ లెవెల్ ఫస్ట్ ర్యాంక్, పి జైత్యశ్రీ సెకండ్ ర్యాంక్, ఏడో తరగతి విభాగంలో డి.సందీప్ డిస్టిక్ లెవెల్ ఫస్ట్ ర్యాంక్ యు.వై .రోహిత్ సెకండ్ ర్యాంక్, ఎనిమిదవ తరగతి భాగంలో జి .గాయత్రి డిస్టిక్ లెవెల్ ఫస్ట్ ర్యాంక్ డి అమృత సెకండ్ ర్యాంక్ ,9వ తరగతి భాగంలో ఎస్.భవాని రిషిత డిస్టిక్ లెవెల్లో ఫస్ట్ ర్యాంక్ ,కే .సాయి శ్రీ సెకండ్ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా రాయలసీమలో బెస్ట్ స్కూల్ గా మా స్కూల్ డైరెక్టర్ పి.మౌలాలి రెడ్డి చాత్రాలయ పురస్కారం అందించడం మా పాఠశాల సాధిస్తున్న విజయాలకు నిదర్శనమని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. బ్రెయిన్ బాక్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ద్వారా మాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టు నందు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం చే చక్కని శిక్షణ ఇస్తున్నామనుటకు మా విద్యార్థులు సాధించే విజయాలే దీనికి తార్కానమని తెలిపారు. విద్యార్థుల విజయానికి శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు





**క్రీడలు విద్యార్థులలో ఆత్మస్థైర్యం కలిగిస్తాయి:**
**ఆదాయ పన్ను అధికారి రమణారావు**
**తైక్వాండో బెల్ట్ లు ప్రదానం చేసిన డాక్టర్ రామకృష్ణారెడ్డి, రమణారావు, డాక్టర్ రవి కృష్ణ**
**నిర్వహించిన రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, మాస్టర్ బాలకృష్ణ**

నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 7 ( నంది పత్రిక ). కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష పోటీలలో 140 మంది తైక్వాండో క్రీడాకారులు పాల్గొని వివిధ కేటగిరి బెల్ట్ లు సాధించారు. ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్ టి చంద్రమౌళి ఆధ్వర్యంలో, మాస్టర్ బాలకృష్ణ నిర్వహణలో, కర్నూలు జిల్లా మాజీ ఒలంపిక్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రదానోత్సవం లో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, చిత్తూరు జిల్లా ఆదాయ పన్ను అధికారి రమణారావు,నంద్యాల జిల్లా క్రీడాభారతి అధ్యక్షులు సుధాకర్ అతిధులుగా పాల్గొని క్రీడాకారులకు వివిధ కేటగిరి బెల్ట్ లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆదాయ పన్ను అధికారి రమణ రావు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో ఆత్మస్థైర్యం, శారీరిక దారుఢ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, ఏకాగ్రతలను ఇనుమడింపచేస్తాయని అన్నారు. సుధాకర్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ క్రీడలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తైక్వాండో ఒలింపిక్ లో గుర్తింపు పొందిన క్రీడ అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు నంది పత్రిక..... ఈనెల 12న తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునియప్ప పిలుపునిచ్చారు స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలోని నగర కౌన్సిల్ సమావేశం జరిగినది ఈ సమావేశానికి నగర అధ్యక్షులు బి వెంకటేష్ అధ్యక్షతన జరిగినది ఈ సమావేశంలో ముఖ్య అతిథి ఎస్ మునియప్ప మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్లలో తీసుకొచ్చి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందని తక్షణమే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి యధావిధిగా 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని వారు అన్నారు కర్షక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు కార్మికులకు ఐక్య పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తుందన్నారు దీనితో కార్మికులకు పలు హక్కులను కోల్పోతారని తెలిపారు 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్కులను చట్టాలను తీసుకొచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల వ్యవసాయ రైతు సంఘాల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నారన్నారు రాష్ట్ర నాయకులు మనోహర్ మాణిక్యం మాట్లాడుతూ. ఫిబ్రవరి 12న అన్ని కర్నూలు నగరంలో ఆటో అమాలి భవననిర్మాణ హోటల్ ఉద్యోగ సంఘాలు మొత్తం పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలోని ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ కృష్ణారెడ్డి డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మదిలేటి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మల్లన్న రహిమాన్ రేణుక ఆటో వర్కర్ యూనియన్ నాయకులు నాగరాజ్ ఈశ్వర్ రెడ్డి రంగనాయకులు మాణిక్యం పాల్గొన్నారు.




# ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరి ఆవిష్కరణ

కర్నూలు నంది పత్రిక..... జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి చాంబర్ లో ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరి 2026 జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.భాస్కర్ పరిపాలనాధికారి అరుణ ,మాస్ మీడియా ఆఫీసర్ ప్రకాష్ రాజు,డిప్యూటి డెమో షఫీఉన్నిస ,

డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి , గణాంకాదికారి హేమసుందరం ,కమ్యూనిటి ఆర్గనైజర్ సలిమతో కలిసి డైరిని ఆవిష్కరించినారు, అనంతరం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై,వ్యాధినిరోధక టికాలకార్యక్రమముపై,క్షయ,కుష్టు,ఎయిడ్స్,కుటుంబ సంక్షేమపథకాలు,భ్రూణ హత్యలపై,మాత్రు శిశు మరణాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ,సంక్రమిత,

అసంక్రమిత వ్యాధులపై మరియు గాలి ,నిటి,కిటకతకజనిత వ్యాధులపై ప్రజలకు అవగాహనా కల్పించాలని తెలిపారు.



# మహానందీశ్వర స్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబు,మంత్రి లోకేష్ కు ఆహ్వానం





### మహానంది ఆలయం అభివృద్ధికి సహకరించండి ఎమ్మెల్యే బుడ్డా వినతి

**మహానంది ఫిబ్రవరి 07 (నంది పత్రిక):-** మహానంది క్షేత్రంలో ఈనెల 13 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ ను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఈవో శ్రీనివాస్ రెడ్డి ,దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తో కలిసి ఆహ్వానించారు.ముందుగా వేద పండితులు,అర్చకులు వేదమంత్రాలు నడుమ ఎమ్మెల్యే,ఈవో సీఎం చంద్రబాబును,మంత్రి నారా లోకేష్ ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి,స్వామివారి జ్ఞాపిక,తీర్థ ప్రసాదాలు అందజేశారు.మహానంది క్షేత్రం విశిష్టత గురించి ఎమ్మెల్యే వివరించారు.మహానంది క్షేత్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామనీ ఇందుకు గాను దాతలు అనేకమంది ముందుకు వస్తున్నారన్నారు.ప్రభుత్వం నుండి సహకారం కావాలని ఎమ్మెల్యే బుడ్డా కోరారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం,మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ పర్యవేక్షకులు నీలకంఠేశ్వర రాజు,తదితరులు పాల్గొన్నారు.





# కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా క్రీడోత్సవం



**చిత్తూరు జిల్లా బ్యూరో, (నంది పత్రిక ) ఫిబ్రవరి 7 కుప్పం** ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడోత్సవ కార్యక్రమం బిసియన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్ సునీల్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమంను జాతీయ పతాకావిష్కరణలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ అభివందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రీడోత్సవంలో వివిధ రకాల ఇండోర్ ఔట్డోర్ క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ సునీల్ రాజ్ మాట్లాడుతూ... చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని, అవి శారీరకంగా మానసికంగా ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని విద్యార్థులకు సూచించారు. క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రధానం చేశారు. యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్ సునీల్ రాజ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, ఫిజికల్ డైరెక్టర్ సతీష్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏమ్ఓయూ ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 07 . (నంది పత్రిక ):**శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నంద్యాల మరియు ప్రముఖ డేటా సైన్స్ సంస్థ డాటావ్యాలీ మధ్య జనవరి 30, 2026న అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, రియల్‌టైమ్ ప్రాజెక్టులు, ఇండస్ట్రీ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్‌లు మరియు కెరీర్ మార్గదర్శకత్వం అందించనున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, అకడమిక్ విద్యతో పాటు పరిశ్రమ అనుభవం కలిసినప్పుడే విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకుంటారని తెలిపారు. ఈ ఏమ్ఓయూ ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరిగి, ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగవుతాయని ఆయన అన్నారు.కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి డా. ఎన్. రమాదేవి మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఏఐ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు నిరంతర శిక్షణ మరియు పరిశ్రమతో నేరుగా అనుసంధానం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశోధన దృక్పథం మరియు ఇన్నోవేషన్‌ను పెంపొందించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు.ఈ అవగాహన ఒప్పందం ద్వారా సంయుక్త వర్క్‌షాప్‌లు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పరిశ్రమవిద్యా సంస్థల మధ్య సహకారం మరింత బలోపేతం కానుందని కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

# వాయిస్ క్లోనింగ్ సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

**కర్నూలు నంది పత్రిక....** వాయిస్ క్లోనింగ్ ద్వారా బంధువుల గొంతుతో ఫోన్ చేసి డబ్బులు అడిగే మోసాలు పెరుగుతున్నాయని ఇటువంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ శనివారం తెలిపారు. వాయిస్ క్లోనింగ్ కు సంబంధించిన కొత్త స్కామ్‌లు జరుగుతున్నాయన్నారు. స్కామర్లు ఇప్పుడు గొంతులను క్లోన్ చేయడానికి ఞ× ని ఉపయోగిస్తున్నారన్నారు. తెలిసిన బంధువులు / స్నేహితుల గొంతులలాగా మాట్లాడుతూ అత్యవసర సహాయం చేయడానికి పెద్ద మొత్తంలో డబ్బును త్వరగా బదిలీ చేయమని కోరతారన్నారు. డబ్బు బదిలీ పూర్తయిన తర్వాత, బాధితులు తమ కుటుంబ సభ్యుడిని లేదా స్నేహితుడిని స్వయంగా వచ్చి కలిసినప్పుడు లేదా సంప్రదించినప్పుడు తాము మోసపోయామని గ్రహిస్తారన్నారు. ముఖ్యంగా వారు అత్యవసర ఆర్థిక సహాయం కోరితే, ఏదైనా చర్య తీసుకునే ముందు వారి గుర్తింపును నిర్ధారించడానికి తెలిసిన, ధృవీకరించబడిన నంబర్ ద్వారా స్నేహితుడు/బంధువును సంప్రదించాలన్నారు. కర్నూలు ఎస్పీ ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా , వాట్సాప్ , ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోకూడదు. అనధికారిక వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా కొనుగోళ్లు చేయవద్దు అధికారిక షాపింగ్ యాప్‌లు/వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించండి సోషల్ మీడియాలో కనిపించే అతిగా తక్కువ ధరల ఆఫర్లను నమ్మవద్దు ఏదైనా సైబర్ మోసానికి గురైనట్లయితే వెంటనే



1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ జిల్లా ప్రజలకు తెలియజేశారు.

# సిపిఐ పార్టీలో చేరిన 50 కుటుంబాలు

### -సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు




**మిడుతూరు. ఫిబ్రవరి 07 . (నంది పత్రిక ):**భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ లో మిడుతూరు మండలం లోని తలముడిపి, జలకనూరు చింతలపల్లె, మిడుతూరు గ్రామాలలోని 50 కుటుంబాలు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ .రంగనాయుడు సమక్షంలో చేరినారని సిపిఐ జిల్లా నాయకులు ఎం శ్రీనివాసులు తెలిపారు.స్థానిక మిడుతూరు మండలంలోని శుక్రవారం నాడు ముఖ్య నాయకుల సమావేశం సిపిఐ జిల్లా నాయకులు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న సుబ్బారెడ్డి సిపిఐ జిల్లా నాయకులు రమేష్ బాబు ,శివయ్య, నాగరాజు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ కార్మిక కర్షక ప్రజా సమస్యలపై నిరంతరం చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం చాలా సంతోషకరమైందని, మిడుతూరు మండలం లోని అలగనూరు మద్దిగుండం చెరువుల మరమ్మత్తులు చేయించడంలో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దీని వల్ల వేల ఎకరాలకు సాగునీరు ప్రజలకు త్రాగునీరు అందడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాలలో సిసి రోడ్లు ,డ్రైనేజీ , పారిశుధ్యం పై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ,ఈ ప్రాంత ప్రజా, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి నిరంతరం సిపిఐ పార్టీగా పోరాటాలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. **నూతన కమిటీ ఎన్నిక:-** మిడుతూరు మండల సిపిఐ కార్యదర్శిగా మద్దిలేటి , సహాయ కార్యదర్శిగా రామకృష్ణ, సమితి సభ్యులుగా హరి రమణయ్య లతోపాటు 16 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.



# వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక....**ఎన్జీటి (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ) నిర్దేశాల ప్రకారం వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ ప్రక్రియల అంశాల పై కలెక్టర్ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ కమిషనర్ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీ లలో రోజుకు ఎన్ని మెట్రిక్ టన్నులు వ్యర్థాలు సేకరించారు, సేకరించిన వ్యర్థాలలో ఎన్ని టన్నులు తడి, పొడి చెత్త ఉంది అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. తడి చెత్తను విండ్రో కంపోస్టింగ్ పద్ధతి ద్వారా వ్యవసాయ ఎరువుగా మార్చాలన్నారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్, గాజు, మరియు పేపర్ వంటి వస్తువులను వేరు చేసి రీసైక్లింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డ్ లలో పేరుకుపోయి ఉన్న వ్యర్థాలను క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఫ్యామిలీ యూనిఫైడ్ సర్వే లో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి, ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘజియాబాద్ అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసు...

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ముగ్గురు మైనర్ అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. కొరియన్ ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలైన ముగ్గురు అక్కాచెల్లెళ్లకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను వారి తండ్రి డిలీట్ చేశాడు. వారి వద్ద నుంచి ఫోన్లు కూడా తీసుకుని విక్రయించాడు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ అభినవ శంకరానంద స్వాముల వారిచే ప్రవచనాలు...



**నంది పత్రిక / చాగలమర్రి న్యూస్ ;** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రిలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ వీరంరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యములో శ్రీ అభినవ శంకరానంద స్వాముల వారిచే ప్రవచనాలు వినిపించారు. ఈదుల ఎల్లారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ అభినవ శంకరానంద స్వాముల వారికి పూలమాల వేసి , శాలువ కప్పి సత్కరించారు. ఈదుల ఎల్లారెడ్డి ఆధ్వర్యములో శివ స్వాములకు , నరసింహ స్వాములకు , భక్తులకు దాదాపుగా 200మందికి శివాలయములో బిక్ష ఏర్పాటు చేయించారు.ఈ కార్యక్రమంలో బిక్ష దాతలు ఈదుల ఎల్లారెడ్డి ధర్మపత్ని సుమలత ,కుమార్తె అక్షయ , కుమారుడు హితేశ్వర్ రెడ్డి , పినాకినిరెడ్డి , రామసుబ్బమ్మ , వినీత , శివ కార్తికేయరెడ్డి , ఆలయ అధ్యక్షుడు వీరంరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, శివ స్వాములు , నరసింహ స్వాములు , భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

# రెండు కొండచిలువలు స్వాధీనం

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 7 :** బండి ఆత్మకూరులో రెండు కొండచిలువలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని రైస్ మిల్లు వద్ద రెండు కొండచిలువలు సంచరిస్తున్నాయని సమాచారం రావడంతో అటవీ సిబ్బంది శనివారం ఇక్కడికి చేరుకున్నారు. రిస్క్ టీం సభ్యులు గోపి నిఖిల్ మనోజ్ తదితరులు ఇక్కడికి చేరుకొని చాకచక్యంగా రెండు కొండలు చిలువలను పట్టుకున్నారు. వాటిని జాగ్రత్తగా సంచులలో భద్రపరిచి అటవీ ప్రాంతంలో వదిలివేస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హైమావతి తెలిపారు



# మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**
**నగరంలో రూ.29.81 కోట్లతో అభివృద్ధి పనులు**
**నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి**
**అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతిరోజు పరిశీలించాలి**

కర్నూలు నంది పత్రిక.... నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శనివారం 19వ వార్డులోని హోసన్నా మందిర్ రోడ్డులో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రహదారిని పరిశీలించి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో వాకీటాకీ ద్వారా మాట్లాడారు. ప్రజాధనంతో చేపట్టే ప్రతి పనిలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. సిమెంట్, ఇసుక, గ్రావెల్, నీటి నాణ్యతను పరీక్షించి ప్రమాణాలకు అనుగుణమైన పదార్థాలనే గుత్తేదారులు ఉపయోగించేలా ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు క్షేత్రస్థాయిలో అమినిటీస్ కార్యదర్శుల పనితీరు కీలకమని పేర్కొంటూ నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణమే పరిష్కరించుకోవాలని చెప్పారు. వర్షపు నీరు నిల్వ కాకుండా సరైన స్లోప్ ఏర్పాటు చేయడంతో పాటు కాంక్రీట్ పోసిన తర్వాత కనీసం రెండు వారాల పాటు తడిగా ఉంచే విధంగా క్యూరింగ్ చేయాలని స్పష్టం చేశారు.నగరంలో మొత్తం రూ.29.81 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులు కొనసాగుతున్నాయని, అందులో రూ.25.25 కోట్లు సాధారణ నిధులు, రూ.4.16 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు, అదనంగా రూ.40 లక్షలతో పలు పనులు చేపట్టినట్లు వెల్లడించారు.అన్న క్యాంటీన్ల సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి ప్రజలకు అందించే భోజనం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు ఎల్లప్పుడూ కచ్చితంగా పాటించేలా నోడల్ అధికారులు పనిచేయాలని సూచించారు. క్యాంటీన్లలో అందించే ఆహారం తాజాగా, శుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. భోజన తయారీ నుంచి పంపిణీ వరకు అన్ని ప్రక్రియలను నోడల్ అధికారులు ప్రతిరోజు పరిశీలించి ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్వచ్ఛత పనులు, తాగునీరు వంటి అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అమినిటీస్ కార్యదర్శి శ్వేత రెడ్డి, శానిటేషన్ ఇంస్పెక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించండి

**దళితుల సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలి**
**మాల సంఘాల జెఎసి నాయకులు**



నంద్యాల బ్యూరో, ఫ్రిబ్రవరి07(నంది పత్రిక):- ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు వెంటనే కేటాయించాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, రాయలసీమ గౌరవ అధ్యక్షులు అశోక్ రత్నంలు అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలో స్టేట్ గెస్ట్ హౌస్ నందు ఎస్సీ కమిషన్ నెంబరు గౌతమ్ రాజు కు మాల మహానాడు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అశోక్ రత్నం, దస్తగిరి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 26 దళిత పథకాలను ప్రవేశపెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ఎన్ఎస్ఎఫ్డిఎస్ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 41 నోటీసు రద్దు చేసి ముందస్తు బయలు రద్దు చేయాలని ఎవరైతే దళితులు సాగులు ఉన్నారో వారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఎట్టి మాలలకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. సాగులో ఉన్న ప్రతి దళిత రైతుకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నంద్యాల జిల్లా అధ్యక్షుడు బండి దేవాంతకుడు, రాయలసీమ జేఏసీ నాయకులు బి మద్దిలేటి, యువజన అధ్యక్షులు బండి దేవదాసు తదితర మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ టోల్ గేట్ వసూళ్లను నిలిపివేయాలి.

**ఎన్ హెచ్ 340 బి నిర్మాణ పనులు పూర్తి కాక ముందే టోల్గేట్ వసూలు చేయడం సరైనది కాదు.**
**నిర్మాణ దశలో ప్రమాదాల బారినపడి రోడ్డున పడ్డ బాధితుల కుటుంబాలను పట్టించుకునేది ఎవరు?.**
**ప్రజల ప్రాణాల కన్నా టోల్గేట్ వసూళ్లే ముఖ్యమా?.**
**స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి స్పందించి తక్షణమే నిలుపుదల చేయాలి.**
**భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్**



బేతంచెర్ల ఫిబ్రవరి 7 ( నందిపత్రిక ). డోన్ బేతంచెర్ల మీదుగా ఎన్.హెచ్ 340 బి.జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతుండగానే, బేతంచెర్ల మండలం కొత్తపల్లె గ్రామం వద్ద, ఎన్.హెచ్ 340 బి. జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన టోల్గేట్ వద్ద ప్రయాణికుల, వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడడం తక్షణమే నిలిపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా, సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, డి.దస్తగిరి, పట్టణ కార్యదర్శి పి.నాగరాజు లు ముఖ్య కార్యకర్తల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన జాతీయ రహదారి నిర్మాణ పనులు ఓవైపు కొనసాగు తుండగానే మరోవైపు టోల్గేట్ వసూళ్ల పేరుతో అక్రమ ధనార్జనే ధ్యేయంగా ప్రయాణికుల వాహనదారుల నుంచి ముక్కు పిండి టోల్గేట్ వసూలు చేస్తున్నారని, ఇదే జాతీయ రహదారిపై అనేక ప్రమాదాలకు గురై వందలాది మంది బాధితులు, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని,వారిని గానీ,వారి కుటుంబాన్ని గానీ, కనీసం పట్టించుకోకుండా, ఇప్పుడు వసూళ్లకు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జాతీయ రహదారిలో వాహనదారుల, ప్రయాణికులకు కనీస వసతులు లేకుండా, రహదారి భద్రత గాలికి వదిలేసి, కేవలం వసూళ్ల మీదనే దృష్టి కేంద్రీకరించడం, వసూళ్లకు అనుమతులు ఇచ్చిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని విమర్శించారు. రహదారిపై విద్యుత్తు, లైటింగ్ సౌకర్యం లేని కారణం చేత, అనేక ప్రమాదాలు నేటికీ సంభవిస్తున్నాయని, నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జిలను నాణ్యత లేకుండా నిర్మిస్తూ, జాతీయ రహదారి నిర్మాణంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో, మొత్తం జాతీయ రహదారి నంత నాసిరకంగా నిర్మిస్తున్నారని, ప్రజల ప్రాణాల కన్నా అక్రమ సంపాదనే లక్ష్యంగా నిర్మాణ పనులు సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు నిరంతరం పొట్ట చేతో పట్టుకొని బతుకు తెరువు కోసం, కూలీ పనులకై ప్రయాణించే వాహనదారుల ప్రయాణికులపై, టోల్గేట్ వసూలు చేయడంను తక్షణమే నిలిపివేయాలని స్థానిక శాసనసభ్యులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఎన్.హెచ్ 340 బి. నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు, అక్రమ టోల్గేట్ వసూళ్ళను నిలిపివేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రమాబాయ్ అంబెడ్కర్ 128వ జయంతి



కర్నూలు నంది పత్రిక...... కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం మంత్రాలయం మండలం నందు ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ, మహిళా ఐక్య వేదిక నూతన కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ప్రారంభించారు.మండల కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు వగ్గా ఈరమ్మ ఆధ్వర్యంలో రమాబాయి అంబెద్కర్ 128 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి లు రమాబాయి అంబెద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ 7.2.1898 న జన్మించిన రమాబాయి తొమ్మిది సంవత్సరాల వయసు లోనే అంబెద్కర్ తో వివాహం జరిగింది. అప్పటి నుండి అంబెద్కర్ కు అన్ని విషయాల్లో తోడుగా ఉంటూ బాబా సాహెబ్ అంబెద్కర్ విజయాలకు రమాబాయి కారణమని ఆమె అన్నారు.రమాబాయి తన త్యాగాల పునాదుల మీద బాబాసాహెబ్ ని ఒక మేను పర్వతంగా నిలబెట్టిందని, అంతే కాకుండా అంబెద్కర్ ఒక్కో విజయం వెనుక రమాబాయి త్యాగాల తాలూకు ఎన్నో గాయాలు ఆమెలో ఉన్నాయని అన్నారు. అంబెద్కర్ కు ఎల్లవేళలా తోడుంటూ, ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ, ఆయన ఉన్నత చదువుల కోసం తాను ఎన్నో బాధలు అనుభవించిందని, ఇల్లు గడవని స్థితిలో రమాబాయి పిడకలు అమ్మి కుటుంబాన్ని పోషించడమే కాకుండా అందులో కొంత డబ్బును అంబెద్కర్ గారికి పంపించే వారని ఆమె అన్నారు. రమాబాయి పేదరికంతో పోరాటం చేస్తూ , ఆ పేదరికం కారణంగా తన సంతానం లో ఒక్కొక్కరుగా చనిపోతున్నా , మొక్కవోని ధైర్యంతో రమాబాయి అంతటి బాధను గుండెల్లోనే దాచుకొని బాబాసాహెబ్ కి ధైర్యాన్ని నూరిపోసే వారని ఆమె అన్నారు. రమాబాయి తన కొడుకు చనిపోయినప్పుడు బాబాసాహెబ్ చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి చూసి తన పెళ్లి చీర కొంగును చింపి కొడుకు శవం మీద కప్పి ,తమ పరిస్థితిని ఎదుటివారికి చూపించ కుండా జాగ్రత్త పడిన విషయం తెలిస్తే బాబాసాహెబ్ కోసం ఆమె పడిన ఆవేదన ఇట్టే అర్థం అవుతుందని ఆమె తెలిపారు. తొమ్మిది సంవత్సరాల అతి చిన్న వయసులోనే అంబెద్కర్ జీవితంలోకి వచ్చిన రమాబాయి 30 సంవత్సరాలు అంబేద్కర్ తో ఉండి, అంబేద్కర్ అత్యున్నత స్థాయికి ఎదగడంలో రమాబాయి ది ఒక ప్రత్యేకమైన స్థానం అని ఆమె అన్నారు. నేటి తరం మహిళలకు రమాబాయి ఆదర్శం అని, రమాబాయి అంబెద్కర్ అంటేనే పోరాటం, రమాబాయి అంబెద్కర్ అంటేనే త్యాగం అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఐక్య వేదిక సభ్యులు మంత్రాలయం మండలం అధ్యక్షురాలు కమ్మరి లక్ష్మి , ఆదోని డివిజన్ అధ్యక్షురాలు ఎలీశమ్మ , సింధూజ, శిల్పా కళావతి, రేవతి, ఎమ్మిగనూరు మండలం అధ్యక్షురాలు మరియమ్మ , జిల్లా ఉపాధ్యక్షురాలు హుస్సేన్ బీ, గూడూరు మండలం అధ్యక్షురాలు అమీనాబీ, చిరంజీవమ్మ , సుశీలమ్మ , ప్రభావతి, ప్రియాంక , ఈరమ్మ ,బోయలక్ష్మి , హనుమంతమ్మ , ఉప్పరి అనూష, రేవతి, వడ్ల చంద్రకళ, బోయ సుందరమ్మ , జయలక్ష్మి , పద్మావతి, రమాదేవి, రామాంజినమ్మ , ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9 నుంచి 11 వ తేదీ వరకు ఏపీపీఎస్సీ పరీక్షలను సజావుగా నిర్వహించాలి



**డిఆర్వో వెంకట నారాయణమ్మ**

కర్నూలు, నంది పత్రిక.....ఈ నెల 9 నుంచి 11 వ తేదీ వరకు ఏపీపీఎస్సీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని డిఆర్వో వెంకట నారాయణమ్మ అధికారులకు సూచించారు.శనివారం కలెక్టరేట్ లో ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో డిఆర్వో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 11 వ తేదీ వరకు ఏపీపీఎస్సీ కి సంబంధించి ఏపీ ఫారెస్ట్ సబ్-ఆర్డినేట్ సర్వీస్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ & అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ (మెయిన్స్), థానేదార్, ఏపీ ఎండో మెంట్స్ సబ్-ఆర్డినేట్ సర్వీస్‌లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్×× వ్రాత పరీక్షలను ఆఫ్‌లైన్ విధానం / ాపీ= ఆధారిత (ఆబ్జెక్టివ్ టైప్) రూపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో 7 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. మొత్తం 9,958 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు..సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా బ్యాకప్, తాగునీటి సౌకర్యం, కూర్చునే ఏర్పాట్లు, అలాగే ాాాజ మార్గదర్శకాలను కఠినంగా పాటించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని డిఆర్వో ఆదేశించారు.ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు .ఉదయం 8.00 నుండి 8.45 గంటల వరకు, అదనంగా 15 నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో 9.00 గంటల వరకు, మధ్యాహ్నం 1.00 నుండి 1.45 గంటల వరకు, అదనంగా 15 నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో 2.00 గంటల వరకు జరుగుతాయని, గ్రేస్ పీరియడ్ ముగిసిన తరువాత ఎవరినీ అనుమతించరని తెలిపారు. పూర్తి పరీక్ష సమయం ముగిసే వరకు ఎవరూ పరీక్ష హాలును విడిచిపెట్టరాదని తెలిపారు. టాబ్లెట్లు, ఐప్యాడ్లు, రైటింగ్ ప్యాడ్లు, హ్యాండ్‌బ్యాగులు, కాగితాలు, పుస్తకాలు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ / డిజిటల్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు (ఏ విధమైనవి అయినా) మరియు సమాచారాన్ని నిల్వ చేయగల / పంపగల / స్వీకరించగల ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాలులోకి తీసుకురావడం నిషేధం అని తెలిపారు.కేవలం అనలాగ్ చేతి గడియారాలు మాత్రమే అనుమతించబడ తాయన్నారు. అంధత్వం, లోకోమోటర్ వైకల్యం (రెండు చేతులు ప్రభావితమైన వారు దీూా) మరియు సెరెబ్రల్ పాల్సీ వర్గానికి చెందిన బెంచ్‌మార్క్ వైకల్యాలున్న అభ్యర్థులకు అవసరమైతే స్క్రైబ్ / రీడర్ / ల్యాబ్ అసిస్టెంట్ సౌకర్యం కల్పించబడుతుందన్నారు.

అదనంగా, పరీక్షలకు సంబంధించిన సమాచారం కోసం కలెక్టరేట్, కర్నూలులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (ల్యాండ్‌లైన్ నెం. 08518-277305) కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని డిఆర్వో తెలిపారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివరాముడు, కల్లూరు, కర్నూలు రూరల్ మరియు కర్నూలు అర్బన్ మండలాల తహసీల్దార్లు, పోలీస్,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది...

**ఎంపీ బస్తిపాటి నాగరాజు**



కర్నూలు నంది పత్రిక... మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు..ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కర్నూలు రూరల్ మండలం సుంకేసుల జాలాశయంలోకి కోడుమూరు ఎం.ఎల్.ఏ బొగ్గుల దస్తగిరి తో కలిసి ఆయన 1,66,000 చేప పిల్లలను విడుదల చేశారు...ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలోని మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు...సంప్రదాయ మత్స్యకారులను ఎస్.టీ జాబితాలో చేర్చే అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానని ఆయన తెలిపారు.



నంది

ఆదివారం 08 - 02 -2026

# లక్ష్యం దిశగా చదవాలి..

# ఆరోగ్యమే మహాభాగ్యం

### సీఐ వెంకట్రామిరెడ్డి

**నంది పత్రిక -ప్యాపిలి** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ప్యాపిలి సిఐ వెంకట్రామి రెడ్డి, ఎస్ఐ నాగార్జున పేర్కొన్నారు. శనివారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో విద్యార్థినులకు కౌన్సిలింగ్ మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వారు మాట్లాడుతూచదువే ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థినులు కష్టపడాలన్నారు. అధ్యాపకులు తరగతి గదుల్లో చెప్పే అంశాలను శ్రద్ధగా నోట్ చేసుకోవాలని, టెక్స్ట్ బుక్స్‌ను క్షుణ్ణంగా చదవాలని సూచించారు. క్రమశిక్షణ కలిగిన విద్యార్థులే రేపటి పౌరులని ఆయన ఉద్ఘాటించారు.

**కుష్టు వ్యాధిపై అప్రమత్తత అవసరం** డీపీఎంఓ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ 'స్పర్శ' కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా పలు సూచనలు చేశారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు ఉండటం. కనురెప్పల వెంట్రుకలు రాలడం, కాళ్లు చేతుల్లో జోములు రావడం వంటివి కుష్టు లక్షణాలు కావచ్చని తెలిపారు.ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆశా కార్యకర్తలను లేదా వైద్య సిబ్బందిని సంప్రదించాలని



కోరారు. వ్యాధి నిర్ధారణ అయితే ఎం డి టీ మందులతో పూర్తి స్థాయిలో నయం చేయవచ్చని భరోసా ఇచ్చారు. బాల్య వివాహాలను అరికట్టాలంటే బాలికలు చదువును కొనసాగించడమే ఏకైక మార్గమన్నారు.అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని స్పష్టం చేశారు.క్యాన్సర్, క్షయ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ముఖ్యంగా విద్యార్థినులకు ఋతుక్రమ పరిశుభ్రత, 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మురళీ కృష్ణ, రాఘవేంద్ర గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియాంక, జయలక్ష్మి, ఆశా కార్యకర్త రమాదేవి మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైనిక భాస్కర్ కుటుంబానికి జరిగిన అన్యాయంపై మాల మహానాడు ఆధ్వర్యంలో న్యాయ పోరాటం కడపలో నిరాహార దీక్షకు విస్తృత మద్దతు



**బద్వేల్, ఫిబ్రవరి 7( నంది పత్రిక):** మాల మహానాడు (చెన్నయ్య వర్గం) కడప జిల్లా అధ్యక్షులు జ్యేష్ఠాది భాస్కర్ ఆధ్వర్యంలో సైనిక భాస్కర్ కుటుంబానికి జరిగిన అన్యాయంపై న్యాయం కోసం శాంతియుత నిరాహార దీక్షకు మద్దతుగా కడప పట్టణంలో కార్యక్రమం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ రాత్రి సైనిక భాస్కర్ కుటుంబ నివాసం కూల్చివేతకు గురైన ఘటనపై తీవ్రంగా స్పందించిన మాల మహానాడు నాయకులు, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని, వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ నిరసనకు సీపీఐ నాయకులు వెంకట శివ, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపకులు సంగటి మనోహర్, మానవ హక్కుల సంఘం ప్రతినిధి జేవీ రమణ, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇల్లూరి సురేష్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు బేరీ అహరోన్, బీఎస్పీ కడప జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప, మరియాపురం జోజప్ప, యోగి వేమన విశ్వవిద్యాలయానికి చెందిన మధు తదితర ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల నాయకులతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాల మహానాడు కడప జిల్లా కమిటీ హెచ్చరించింది



# మీడియా సాక్షిగా ఏపీ టుడే ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ అంజి పై దాడి

**చేయి చేసుకున్న టిడిపి కన్వీనర్ కృష్ణారెడ్డి**
**కోక ఊడిపోయినందుకు కోపం రాలేదంట**
**తోడికోడలు నవ్వినందుకే వచ్చింది తంటా**
**అన్నట్లుగా మారింది టిడిపి నాయకుల పరిస్థితి**

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 7:** మీడియా సాక్షిగా ఓ ఎలక్ట్రానిక్ మీడియా టీవీ రిపోర్టర్ పై దాడి జరిగింది. ఈ నేపథ్యంలో మీడియా రిపోర్టర్ ఎడమ కంటికి గాయమైంది. బాధితుడు రిపోర్టర్ అయిన ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బండి ఆత్మకూర్ మండల పరిధిలో ఉన్న సంత జుటూరు గ్రామంలోని రైతు సేవా సహకార సంఘంలో యూరియా సక్రమంగా పంచడం లేదని, పలువురు రైతులు ఆరోపించిన మేరకు ఏపీ టుడే ఎలక్ట్రానిక్ మీడియాలో శుక్రవారం కథనం వెలువడడం జరిగిందని ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ కథనం ప్రసారం కావడంతో స్పందించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు కొందరు శనివారం సంత జుటూరు సహకార సంఘానికి విచారణ నిమిత్తమై వచ్చారు. ఈ నేపథ్యంలో సొసైటీకి చెందిన ఇస్మాయిల్ అనే డైరెక్టర్ ఆంజనేయులుకు ఫోన్ చేసి అధికారులు సొసైటీ కి వచ్చారు మీతో మాట్లాడాలా సొసైటీ కి రావాలంటూ చరవాణి ద్వారా సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఆంజనేయులు శనివారం మధ్యాహ్నం సొసైటీ కి చేరుకున్నారు. అప్పటికే సొసైటీ లో ఉన్న అధికార పార్టీ నాయకులు కొందరీ తో పాటు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ముమ్మడి నాగ కృష్ణారెడ్డి అక్కడే ఉన్నారు. ఆంజనేయులు అక్కడికి చేరుకోగానే నాయకులందరూ అతనితో వాగ్వాదానికి దిగారు. సొసైటీ మాది, మా ఇష్టం వచ్చినట్లు పంచుకుంటాం! అడగడానికి నువ్వు ఎవరు అంటూ వాగ్వాదానికి దిగారు. రైతుల ఆరోపణ మేరకే తాను ఎరువుల పంపిణీ వ్యవహారాన్ని వెలుగులోకి తేవడం జరిగిందని ఆంజనేయులు కూడా అక్కడి వారితో వాగ్వాదానికి దిగారు. ఈ సంఘటనతో సహనం కోల్పోయిన టిడిపి కన్వీనర్ నాగకృష్ణారెడ్డి ప్రింట్ మీడియా సాక్షిగా టీవీ రిపోర్టర్ ఆంజనేయులుపై దాడి చేసి చేయి చేసుకున్నారు. దీనివల్ల ఆంజనేయులు ఎడమ కంటికి గాయమైంది. జరిగిన సంఘటనపై ఆంజనేయులు, తోటి జనం పత్రిక రిపోర్టర్ వెంకటసుబ్బయ్య తో కలిసి పోలీస్ స్టేషన్కు వెళ్లి ఏఎస్ఐ అక్బర్ కు వివరించారు. ఈ విషయాన్ని ఏఎస్ఐ అక్బర్ ఎస్ఐ జగన్మోహన్ కు చరవాణి ద్వారా సమాచారం అందించారు. బాధితుడు ఆంజనేయులు ఎస్సై తో మాట్లాడిన పిదప,జరిగిన సంఘటన లో ఎలాంటి దాడి జరగలేదు కదా! మీరు సర్దుకుపోవాలంటూ ఎస్ఐ ఉచిత సలహా ఇచ్చారని బాధితుడు ఆంజనేయులు పేర్కొన్నారు. అక్కడి నుండి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ఆంజనేయులు చికిత్స పొందుతున్నారు.



**పథకం ప్రకారమే ఆంజనేయులుపై దాడి** సంత జూటూరులో ఏపీ టుడే రిపోర్టర్ ఆంజనేయులు పై ఒక పథకం ప్రకారమే దాడి జరిగినట్లుగా తెలుస్తోంది. పార్టీ నాయకులను కొందరిని సొసైటీలో కి రప్పించుకొన్నారు. సొసైటీలో జరిగిన అక్రమాల ఆరోపణలపై జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుండి ఇద్దరు అధికారులు కూడా సొసైటీలో కూర్చొని ఉన్నారు. సొసైటీ సిబ్బంది, విచారణకు వచ్చిన అధికారుల, ప్రింట్ మీడియా సాక్షిగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నాగకృష్ణారెడ్డి ఆంజనేయులు ను పత్రికలో రాయలేని విధంగా అమ్మనా బూతులు తిడుతూ చేయి చేసుకున్నారు. మండలంలో ఒక గౌరవప్రదమైన తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి సహనం కోల్పోయి ఆంజనేయులుపై దాడీ చేయడంతో అక్కడున్న నాయకులతోపాటు ప్రింట్ మీడియా మిత్రులు కూడా విస్తు పోయారు. ఒక వ్యక్తిగా కంటే గౌరవపదమైన పదవిలో పనిచేస్తూ రిపోర్టర్ పై చేయి చేసుకొని తెలుగుదేశం పార్టీ ప్రతిష్ట బజార్నపడే విధంగా ప్రవర్తించారని పలువురు అప్పుడే చర్చించు కో వడం చర్చనీయాంశమైంది ఒక్కొక్కరిని గొంతు కోస్తా కొడుకుల్లారా అంటూ కృష్ణారెడ్డి ఆవేశంతో ఊగిపోతూ మీడియా గొంతు నొక్కె ప్రయత్నం చేశారని ఆంజనేయులు విచారం వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై వివరణ ఇవ్వాల్సింది పోయి ఇలా దాడి చేయడంలో అర్థం లేకుండా పోతుంది. సొసైటీకి విచారణకు వచ్చిన నంద్యాల జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వచ్చిన అధికారులు కూడా ఈ సంఘటనపై ప్రేక్షక పాత్ర వహించడం ఆశ్చర్యం గొలుపుతూ ఉంది. సొసైటీలో ఎరువుల పంపిణీ వ్యవహారంలో ఏమాత్రం సంబంధంలేని వ్యక్తులు కూడా సొసైటీలోకి చేరుకొని భయానక వాతావరణాన్ని సృష్టించారు.కన్వీనర్ గొంతుతో బ్యాంకు సిబ్బంది కొందరు శృతి కలుపుతూ టీవీ రిపోర్టర్ ఆంజనేయులుపై మాటల వ్యంగ్యోక్తులను ప్రయోగించడానికి బట్టి చూస్తే, అందరూ కలిసి ఆంజనేయులుపై మూకుమ్మడిగా దాడి చేయాలని కంకణం కట్టుకొని ఇలాంటి ప్రయత్నానికి ఒడిగట్టారని తేటతెల్లమవుతూ ఉంది.

## కళాత్మక బోధనతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిస్తున్న ఉపాధ్యాయిని - బండి పరిమళ జ్యోతి



**కాశినాయన ఫిబ్రవరి 7 (నంది పత్రిక):** కాశినాయన మండలంలోని జడ్పీహెచ్ఎస్ రెడ్డి కొట్టాల పాఠశాలలో శనివారం నిర్వహించిన నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు ఉల్లాసంగా విద్యాభ్యాసంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి విద్యార్థులకు చిత్రలేఖనం, రంగు కాగితాలతో పూలగుత్తులు, పడవలు, టోపీలు, గణిత గుర్తులు, కూరగాయలు, జంతువుల ఆకృతులు తయారు చేయిస్తూ సృజనాత్మకతను పెంపొందించారు. ఆటలు, రైమ్స్, పప్పెట్స్ ద్వారా పాఠాలు బోధిస్తూ విద్యార్థులలో ఆసక్తిని పెంచి విజ్ఞానాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రశంసించారు.




# ఉపాధి హామీ కింద కూలీలకు పనులు కల్పించాలి



**పశువుల షెడ్ల నిర్మాణంలో పురోగతి తీసుకొని రావాలి**

**ఇండివిడ్యువల్ సోక్ పిట్స్, కాంపోస్ట్ పిట్స్ పనులను ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు, నంది పత్రిక.....**ఉపాధి హామీ కింద పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఎంపిడిఓ లను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనుల పురోగతి అంశం పై జిల్లా కలెక్టర్ ఎంపిడిఓ లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ కింద కూలీలకు పనులు కల్పిశీచాలన్నారు.. కుటుంబానికి సగటున 100 రోజుల ఉపాధి కల్పనలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. కూలీలకు అందించే సగటు వేతనం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గోకులం పథకం కింద చేపడుతున్న పశువుల షెడ్ల నిర్మాణ పనులలో తుగ్గలి, హాలగుంద, పెద్దకడబూరు, ఓర్వకల్, సి.బెల్గల్, నందవరం మండలాలు చాలా వెనుకబడి ఉన్నాయని, నిర్మాణ పనుల్లో జాప్యం చేయకుండా పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత మండలాల ఎంపిడిఓ లను ఆదేశించారు. ఇండివిడ్యువల్ సోక్ పిట్స్, కాంపోస్ట్ పిట్స్ పనులను ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. పూర్తి చేసిన పనుల పురోగతి వివరాలను యాప్ లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. మ్యాజిక్ డ్రైన్ లాంటి నిర్మాణాలు చేయడం వల్ల మురుగునీరు నిల్వ ఉండకుండా దోమల బెడద తగ్గి, డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉన్న మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇలాంటివి చేపట్టాలన్నారు.

ముఖ్యమంత్రి అనంతపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చినట్లుగానే, నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతాన్ని కూడా హార్టికల్చర్ హబ్‌గా మార్చాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాదికి ఉద్యాన శాఖకు 20,000 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. రాబోయే మూడు ఏళ్లలో 65,000 హెక్టార్లలో తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టారన్నారు.. అందుకోసం ప్రతి మండలంలో కనీసం 2,000 హెక్టార్లను లక్ష్యంగా పెట్టుకోవాలని ఎంపిడిఓ లకు సూచించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ చేసే సమయంలో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం ఖచ్చితంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నర్సరీలతో నేరుగా మాట్లాడి మొక్కలను రిజర్వ్ చేసుకోవాలన్నారు. వచ్చే 15 రోజుల్లో ఏ రకమైన మొక్కలు కావాలి, ఎంత పరిమాణంలో కావాలి అనే డేటాను సిద్ధం చేయలన్నారు. డ్వామా పిడి , ఎంపీడీవోలు అందరూ సమన్వయంతో పని చేసి, ఈ ప్రక్రియ ఎక్కడా ఆగకుండా సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాణిజ్య పరంగా మంచి లాభాలు ఇచ్చే జాస్మిన్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. మామిడి, అరటి, స్వీట్ ఆరెంజ్ వంటి రొటీన్ పంటలతో పాటు సీతాఫలం, నేరేడు, రేగు వంటి పంటలను కూడా సాగు చేయాలన్నారు. కోసిగి, మద్దికెర లాంటి ప్రాంతాల్లో సీతాఫలం, నేరేడు, రేగు సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ఫామ్ పాండ్స్ నిర్మాణంలో పురోగతి తీసుకొని రావాలన్నారు.. మద్దికెర ఈస్ట్ పనుల పురోగతి తక్కువ ఉండటం పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణాల పనులన్నింటినీ మార్చి 31 లోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి 10 రోజులకు ఒకసారి పురోగతిపై నివేదిక ఇవ్వాలన్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే లో ఆదోని మండలం కేవలం 34% మాత్రమే పూర్తి చేయడం ఏంటని కలెక్టర్ ఎంపిడిఓ ను ప్రశ్నించారు. పని తీరు మెరుగుపరిచి పురోగతి తీసుకొని రావాలన్నారు.. వాట్సాప్ క్యాంపెయిన్, హౌస్హోల్డ్ ఈ కెవైసి, ప్4 కార్యక్రమంలో కూడా పురోగతి తీసుకొని రావాలన్నారు.సమావేశంలో డ్వామా పిడి మాధవి లత, ఏపిఓ లు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.



## రష్యా యూనివర్సిటీలో కత్తితో దాడి..
## భారతీయ విద్యార్థి సహా 8 మందికి గాయాలు

రష్యాలోని బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లోని ఒక మెడికల్ యూనివర్సిటీ హాస్టల్‌లో కత్తితో దాడి జరిగిన ఘటనలో ఒక భారతీయుడు సహా ఎనిమిది మంది గాయపడ్డారు. ఒక టీనేజ్ కుర్రాడు కత్తితో వైద్య విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థులు ఉంటున్న హాస్టల్‌లోని స్పోర్ట్స్ హాలులోకి ప్రవేశించి అక్కడున్న విద్యార్థులపై దాడి చేశాడు. అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు పోలీసులు అరెస్టు చేస్తున్న సమయంలో వారిపై కూడా దాడికి పాల్పడ్డాడని, తనను తాను కూడా కత్తితో గాయపరుచుకున్నాడని రష్యా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి మేజర్ జనరల్ ఇరినా వోల్క్ తెలిపారు. నిందితుడిని 15 ఏళ్ల టీనేజర్ గా గుర్తించారు. గాయపడిన విద్యార్థులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థులందరూ ఏ దేశానికి చెందిన వారో తెలియరాలేదు. స్థానిక కథనాల ప్రకారం ఒక భారతీయ విద్యార్థి ఉన్నారు. కత్తితో దాడికి పాల్పడిన నిందితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో పిల్లల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



# కేంద్ర ప్రభుత్వ సహకారంతో బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి బాట.





## ప్రజలందరూ బిఎస్ఎన్ఎల్ సేవలను ఉపయోగించుకోవాలి.

## కర్నూలు పర్యటన సందర్భంగా ఏపీ టెలికాం చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం .

**కర్నూలు నంది పత్రిక.....** కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ టెక్నాలజీతో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలను అభివృద్ధి చేసి రోజు రోజు కు అభివృద్ధి సాధిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం .శేషాచలం చెప్పారు. కర్నూలు బిజినెస్ ఏరియా సాధిస్తున్న ఫలితాలను రివ్యూ చేయడానికి వచ్చిన ఆయన శనివారం నాడు స్థానిక బిఎస్ఎన్ఎల్ భవన్ కార్యాలయం నందు ఉద్యోగస్తులు, వ్యాపార భాగస్వాముల సమావేశంలో మాట్లాడుతూ , కర్నూల్ బిజినెస్ ఏరియాలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధికి తగిన టెలికాం సౌకర్యాలను బిఎస్ఎన్ఎల్ అందిస్తున్నదని, పారిశ్రామికవేత్తలు బిఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించు కోవాలని తెలిపారు. మన దేశ ప్రధాని మరియు కేంద్ర కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ బిఎస్ఎన్ఎల్ కు అందిస్తున్న తోడ్పాటును వినియోగించుకుని ఉద్యోగులందరూ బిఎస్ఎన్ఎల్ సేవలను ప్రజలకు చేరువగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఫ్రాంచైజీలు, టీఐపీల సమస్యలను తెలుసుకుని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఉద్యోగులు,ఫ్రాంచైజీలు, టీఐపీలు అందరూ ప్రజల టెలికాం అవసరాలను తీరుస్తూ , సమస్యలకు పరిష్కారం చేస్తూ సంస్థ ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి గట్టి కృషి చేయాలని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా గడచిన మూడు త్రైమాసికాలకు అద్భుత ప్రతిభ కనబరిచిన డివిజన్ ఇంజనీర్లు, బీబీఎం లకు, ఫ్రాంచైజీలకు, టీఐపీలకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు అంద చేశారు.బిఎస్ఎన్ఎల్ సరికొత్త ఎఫ్ టి టి హెచ్ ప్లాన్: బిఎస్ఎన్ఎల్ స్పార్క్, ఫైబర్ ఇంటర్నెట్ సర్వీసులలో బిఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాను " బిఎస్ఎన్ఎల్ స్పార్క్" ప్రవేశపెట్టింది. కేవలం నెలకు 399/- రూపాయలకే 50 ఎం బి పి ఎస్ స్పీడుతో 3300 జీబీ అ పరిమితమైన డేటాను, అపరిమితమైన కాల్స్ సౌకర్యాలను సంవత్సరం పాటు అందిస్తున్నదని , సంవత్సరం తరువాత నెలకు 449/- ప్లాను గా మారుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బిఎస్ఎన్ఎల్ కర్నూల్ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీజీఎం కె రాజేశ్వర రావు, ఐ ఎఫ్ ఏ డి శ్రీలత, కర్నూలు జిల్లా బిఎస్ఎన్ఎల్ అధికారులు, భాగస్వా ములు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

## ఫిబ్రవరి 23 నుండి మార్చి 24 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు

## జిల్లాలో 55 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ

## సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 07(నంది పత్రిక):-** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, డీఆర్ఓ రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఈఓ జనార్ధన్ రెడ్డి, డీఐఓ శంకర్ నాయక్, జిల్లా కార్మిక అధికారి బషీరున్నిసా, ఎస్ఎస్ఏ పీఓ నిత్యానంద రాజు, డీఈసీ సభ్యులు సునీత, సుంకన్న, మద్దిలేటి స్వామి, రమణ, శ్రీకాంత్, జీవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో అన్ని పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు డిప్యూటీ తహశీల్దార్లను కేటాయించాలని డీఆర్ఓను ఆదేశించారు. జిల్లాలోని 55 పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.





మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 15,443 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం పరీక్షలకు 14,424 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, మొత్తం 29,867 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల్లో తగినంత లైటింగ్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా గదిలో గోడ గడియారం ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సమయానికి చేరుకునేలా ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రహదారులకు సమీపంలో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షలు ముగిసిన వెంటనే సమాధాన పత్రాలను భద్రతతో పోస్టు కార్యాలయాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పోస్టల్ శాఖ అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ, ప్రశ్న పత్రాల సెట్టు నెంబర్లు అందిన వెంటనే పోలీసు ఎస్కార్ట్‌తో పరీక్షా కేంద్రాలకు ప్రశ్న పత్రాలు తరలించే ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని అన్నారు.

# మరుగుదొడ్లు తప్పకుండా నిర్మించుకోవాలి.

## -నీరు, కరెంట్ కొరత లేకుండా చూస్తాం

## -పులల విషయంపై అటవీశాఖ అధికారులకు తెలుపుతాం

## - ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ ఉమారాణిలు



**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామాల్లో కొత్తగా నిర్మించుకుంటున్న పక్కా గృహాలకు మరుగుదొడ్లు నిర్మాణం తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ ఉమారాణిలు సూచించారు. శనివారం మండల పరిధిలోని చదరం పెంట గూడెంలో గిరిజనులు నిర్మించుకుంటున్న గృహానిర్మాణాలను పరిశీలించారు. ముందుగా గిరిజనులు గూడెనికి నీటి సరఫరాచేసే పైప్లైన్ పగిపోయిందని నీరు రావడంలేదని తెలిపారు. అదేవిధంగా కరేంట్ స్థంబాలకు కనెక్షన్ లేకపోవడం. విద్యుత్ బల్బులు లేవని అధికారులకు చెప్పారు. అదేవిధంగా కరెంట్ సౌకర్యంలేకపోవడంతో అడవిలోనుంచి పులల బెడద ఎక్కువైందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు నిర్మించుకున్న ఇళ్లకు బిల్లు మొత్తం లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో జమకావాలంటే మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. లేకపోతే డబ్బులు జమకావు అన్నారు. అదేవిధంగా గూడెంకు వచ్చే నీటి పైపులైన్ కు వెంటనే మరమ్మత్తులు చేయిస్తామని హామీ ఇచ్చారు. నీటి కొరతలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంబాలకు కనెక్షన్ ఇచ్చి, కొత్త విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. అదేవిధంగా పులల బెడదపై అటవీశాఖ అధికారులతో చర్చిస్తామని వాటిబెడద లేకుండా ప్రత్యామ్నయ మార్గం చూపేలా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ వీఆర్వో, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు అక్షరాలు నేర్చుకోవాలి

## - తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి





**కొత్తపల్లి - నంది పత్రిక :** చదువురాని ప్రతి ఒక్కరు తప్పకుండా అక్షరాలు చదవడం, రాయడం నేర్చుకోవాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరిలు సూచించారు. శనివారం మండంలోని గువ్వలకుంట్ల గ్రామంలో అక్షరాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వయస్సు వారైనా బడులకు వెల్లకుండా చదువురాని వారుగా ఉన్నా అటువంటి వారు ఈ కార్యక్రమం ద్వారా అక్షరాలు రాయడం, చదవడం, పలకడం నేర్చుకోవాలన్నారు. ఎవ్వరు కూడా నిరక్షరాసులుగా ఉండకూడదన్నారు. అక్షరాలు నేర్చుకోవడంవల్ల ఏమైనా చదువ గలుగుతామన్నారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమం ద్వారా అక్షరాలు నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ, ఎన్ఆర్ఆజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కూనో నేషనల్ పార్కులో ఐదు చీతా కూనల జననం

మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్కులో 'ప్రాజెక్ట్ చీతా' మరో కీలక మైలురాయిని అందుకుంది. నమీబియా నుంచి తీసుకొచ్చిన 'ఆశా' అనే ఆడ చీతా ఐదు కూనలకు జన్మనిచ్చింది. రెండేళ్లలో ఆశా పిల్లలకు జన్మనివ్వడం ఇది రెండోసారి కావడం విశేషం. ఈ పరిణామం భారత్‌లో చీతాల పునఃప్రవేశ కార్యక్రమం విజయవంతం అవుతోందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఈ శుభవార్తను మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ సోషల్ మీడియా 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. ఇది రాష్ట్రానికే కాకుండా దేశానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. "ఈ కొత్త జననాలతో భారత్‌లో పుట్టిన చీతా కూనల సంఖ్య 24కు, మొత్తం చీతాల సంఖ్య 35కి చేరింది. అటవీ సిబ్బంది, పశువైద్యుల అవిశ్రాంత కృషి వల్లే ఇది సాధ్యమైంది" అని ఆయన తెలిపారు.

# కర్నూలు మరియు నంద్యాల జిల్లాలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లతో నెల వారి నేర సమీక్ష సమావేశం

## పాత నేరస్తులపై నిగా ఉంచండి

## కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పి శ్రీదేవి



**కర్నూలు నంది పత్రిక.....** కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పి శ్రీదేవి తన కార్యాలయం లో కర్నూలు మరియు నంద్యాల జిల్లాలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లతో నెల వారి నేర సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే కర్నూలు జిల్లాలో నాటు సారా రహిత జిల్లాగా ప్రకటించడంతో తిరిగి నాటు సారా తయారీ చేయకుండా పాత నేరస్తులపై నిగా ఉంచాలని వారందరినీ బైండోవర్ చేయాలని, నాటు సారా మానివేసిన వారికి అందరికీ ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రదేశాలలో జాతరలు మరియు పండుగల దృష్ట్యా పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలో కి ప్రవేశించకుండా, నిరంతర నిఘా ఉంచి దాడులు కొనసాగించాలని ఆదేశించారు.పొరుగు రాష్ట్రాల మద్యం కేసుల్లో మరియు గ్రేవ్ క్రైమ్ కేసుల్లోదర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షీట్ కోర్టు కు సమర్పించాలని ఆదేశించారు.గంజాయి పెంపకం మరియు ఇతర నార్కోటిక్ డ్రగ్స్ సరఫరా అరికట్టుటకు నిఘా ఉంచి సమాచారం సేకరించి దాడులు చేయాలని, పెండింగ్ ఉన్న గంజాయి కేసుల్లో, మ్యాజిస్ట్రేట్ చేత ఇన్వెంటరీ మరియు దర్యాప్తు పూర్తి చేసి చార్ షీట్ వేయాలని ఆదేశించారు.ఈ రివ్యూ లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రావిపాటి హనుమంతరావు కర్నూలు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మచ్చ సుధీర్ బాబు , మరియు నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్ రవికుమార్ ,అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లు డి రామకృష్ణారెడ్డి, మరియు . వి రాముడు మరియు కర్నూలు మరియు నంద్యాల జిల్లా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు అందరూ పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు ఎన్ఎండి ఫిరోజ్ భరోసా 10,000 ఆర్థిక సాయం అందజేత



**నంద్యాల సిటీ బ్యూరో, ఫిబ్రవరి 07 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని 38వ వార్డు ఎస్పీవై రెడ్డి స్మార్ట్ సిటీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన అత్యంత దురదృష్టకరమని నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, 38 వ వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు పేర్కొన్నారు. శనివారం వారు ప్రమాద బాధితులను ప్రత్యక్షంగా కలిసి పరామర్శించారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితుల పరిస్థితిని చూసి చలించిన ఎన్ఎండి ఫిరోజ్ , 38 వ వార్డు ఇంచార్జి బుగ్గరాముడు గారి ఆధ్వర్యంలో నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో బాధితుడు మధుసూదన్ రెడ్డి కి ₹10,000 నగదును తక్షణ ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో మాట్లాడి, ప్రభుత్వం నుండి బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకువస్తామని ఫిరోజ్ హామీ ఇచ్చారు. బాధితులు అధైర్య పడకూడదని, తెలుగుదేశం పార్టీ వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్,లింగమయ్య,ప్రవీణ్, చౌడన్న, శేకర్, కేశాలు, అబ్దుల్లా, చిన్న రాయుడు, జాన్సన్, సౌభాగ్య,శేసన్న స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హోమియో వైద్యం గురించి యువతకు శిక్షణ

**వెలుగోడు, ఫిబ్రవరి 07 (నంది పత్రిక):** చిన్న పిల్లలకు, మహిళలకు, ఇతర అన్ని రకాల జబ్బులకు హోమియోపతి వైద్యంలో సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉంది, హోమియో వైద్యంపై అవగాహన పెంచేందుకు యువతకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు డా. రాగ సులోచన ఎమర్జెన్సీ హోమియో హాస్పిటల్ కన్సల్టెన్సీ ఎస్. రఘు రాముడు యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సీజనల్‌గా వచ్చే అన్ని రకాల అనారోగ్య సమస్యలకు హోమియోపతిలో శాశ్వతమైన మరియు త్వరిత పరిష్కారం ఉన్నట్లు తెలుపుతూ నంద్యాల బండి ఆత్మకూరు, వెలుగోడు, ఆత్మకూరు మండలాల్లో చదువుకుని ఖాళీగా ఉన్న యువతకు హోమియోపతి వైద్యంలో శిక్షణ నిర్వహించారు. అని చెబుతూ ఆసక్తి గల యువకులు రూ.1,000/- ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను ఫిబ్రవరి 15లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. నంద్యాలలోని సంజీవ నగర్ రామాలయం ఎదురుగా ఉన్న వైద్యశాలలో డాక్టర్ బండారు నాగేశ్వర రావు యాదవ్ శిక్షణ అందిస్తారని తెలిపారు.శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని, మొదటి విడతలో 20 మందికి మాత్రమే అవకాశం కల్పించబడింది.వివరాల కోసం ఎస్. రఘు రాముడు యాదవ్ 9494166096 నంబర్‌ను సంప్రదించగలరు

# విద్యార్థులకు ఉచిత అద్దాలు పంపిణీ

## - ఆత్మకూరు కంటి వైద్యులు షేక్షావలి

**కొత్తపల్లి - నంది పత్రిక** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్యతోపాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత కల్పిస్తూ శనివారం జిల్లా అందత్వనివారణ సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు కంటి వైద్యులు షేక్షావలి విద్యార్థులకు కంటిఅద్దాలు పంపిణీ చేశారు. కొత్తపల్లిలోని కస్తూరిబా గాంధీ పాఠశాల. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గువ్వలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 45 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత అద్దాలుపంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు స్మార్ట్ ఫోనుకు బానిసలు అయి స్మార్ట్ ఫోన్ నిరంతరంగా వాడుతూ ఎక్కువగా దృష్టి లోపాలను కొని తెచ్చుకుంటుంన్నారన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని అన్నారు. అలాగే విద్యార్థిని విద్యార్థులు రోజువారి ఆహారంలో పోషక విలువలు మెండుగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని, పాలు, గుడ్డు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకుంటే ఆరగ్యానికి ఆరోగ్యం, దృష్టిలోపాలు రాకుండా ఉంటాయని సూచించారు. కళ్ళను జాగ్రత్తగా పరిశుభ్రంగాఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణా బాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరమణ, గువ్వలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఉశేనయ్య, ఉపాధ్యాయ బృందం, సి హెచ్ ఓ శైలజ, ఆరోగ్య కార్యకర్త, సరిత, ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



నంది పత్రిక
ఆదివారం 08 - 02 -2026

## శ్రీశైలం దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మంత్రివర్యులకు ఆహ్వానం



**శ్రీశైలం ఫిబ్రవరి 07(నంది పత్రిక)** శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 8 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను ఆహ్వానించడం జరుగుతోంది. కాగా రాష్ట్ర మానవ వనరులశాఖ అభివృద్ధి మరియు ఐ.టీ, కమ్యూనికేషన్లశాఖ గౌరవ మంత్రివర్యులు శ్రీ నారా లోకేశ్ గారికి ఆహ్వానపత్రికను అందజేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. శ్రీశైలం నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు శ్రీబుడ్డారాజశేఖరరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకస్వాములు, వేదపండితులు మంత్రివర్యులను కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులకు వేదాశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేయడం జరిగింది.

## ఎన్నాళ్లు కేంద్రాన్ని తిడుతూ పాలిస్తారు

మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా అని ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమకు అవసరం అని చెప్పుకోవాలి కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు. పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

## అర్హులైన వారికి గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను అందించండి

### వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి



**కర్నూలు నంది పత్రిక.....** వైయస్సార్సీపి ప్రభుత్వంలో కల్లూరు మండలం తడకనపల్లె సర్వే నంబర్ 86లో ఇల్లు లేని నిరుపేదలకు వైసీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది....నిరుపేదలకు ఇచ్చినటువంటి ఇళ్ల పట్టాలను కొంతమంది అక్రమంగా ఆక్రమించడమే కాకుండా జగనన్న లేఅవుట్లను తొలగించి, అక్రమంగా అక్రమణాలు చేస్తుంటే పట్టి పట్టనట్టుగా రెవెన్యూ అధికారులు ఎలా చూస్తూ ఉరుకుంటున్నారని కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రశ్నించారు...దీనిపై గతంలోనూ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు.. ఇలాంటివి పునరావృతం అయితే సహించేది లేదని ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలను యధావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో వారికి సరైన గుణపాఠం చెప్తామని వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి హెచ్చరించారు...సర్వే నంబర్ 337లో లెవెలింగ్ అని తడకనపల్లె గ్రామంలో అనేక చోట్ల గ్రావెల్ తవ్వకాలు భూఆక్రమణలు జరుగుతున్నాయని గతంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని వారికి తెలిపారు...అర్హులైన వారికి గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు...



# రైస్ మిల్లర్లు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలి









**బియ్యం మిల్లింగ్‌లో వచ్చే ఉప ఉత్పత్తులను సరిగ్గా ఉపయోగిస్తే రైస్ మిల్లర్లు వ్యాపారం ద్వారా మరింత ఆర్థికంగా బలపడతారు**

**బై ప్రొడక్ట్స్ వృథా కాకుండా విలువను సృష్టించే మార్గాలు ఎన్నో ఉన్నాయి, రైస్ మిల్లల్లో అందిపిచ్చుకోవాలి...**

**సాంప్రదాయ మిల్లింగ్ నుండి రైస్ మిల్లర్లు వినూత్నంగా ఆలోచనచేసి వ్యాపారాన్ని విస్తరించడం ద్వారా అభివృద్ధి చెందాలి**

**పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఉత్పత్తి, ఉద్యోగ కల్పన, ఆదాయం పెరుగుతాయి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 7, నంది పత్రిక** కాళ్ల మండలం పెద్దఅమీరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్ నందు శనివారం రైస్ మిల్ యజమానులు, పరిశ్రమ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, యువ నిపుణులు, అధికారులు, కీలక వాటాదారులతో జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా పౌర సరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైస్ మిల్లుల యజమానుల కార్యకలాపాల వైవిధ్యీకరణ మరియు విలువ జోడింపు అవకాశాలపై, విలువ జోడింపు ద్వారా కొత్త అవకాశాలను అన్వేషించడానికి, లాభదాయకతను పెంచుకోవడానికి ఏర్పాటుచేసిన ఎం.ఎస్.ఎం.ఈ అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా మిల్లింగ్ లో ఆంధ్రప్రదేశ్ మ్యాప్ లో ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్న, అనుకున్నంతగా ఎదగలేదన్నారు. ఆధారిత పరిశ్రమంలు నెలకొల్పకపోవడం దీనికి ఒక కారణంగా ఉందన్నారు. బాయిల్డ్ అండ్ స్టీల్ ఫ్రైస్ చేస్తూ ఉండిపోవడం జరిగిందన్నారు. మన జిల్లాలో ఉన్న మిల్లులు నాలుగు నెలలు పనిచేసి మిగతా సమయం అంతా ఖాళీగా ఉండటం అనేది చాలా బాధాకరం అన్నారు. శ్రీకాకుళం జిల్లా వలసల జిల్లాగా ఉండేదని, అలాగే అనంతపురం జిల్లా ఎడారి కింద అయిపోతుంది అని చెప్పే పరిస్థితుల నుండి పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. మన జిల్లాని కేవలం రైస్ మిల్లర్స్ కే పరిమితం చేయకుండా ఫుడ్ ప్రాసెసింగ్ లో మంచి ప్రొడక్ట్స్ తీసుకురావడానికి ముందుకు రావాలన్నారు. మీకు కావాల్సిన సహాయ సహకారాలు మేము అందిస్తామని, మీ సందేహాల నివృత్తికి జిల్లా కలెక్టరేట్లో ఒక కంట్రోల్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పారిశ్రామిక అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు తరచుగా వర్క్ షాప్ లు నిర్వహించాలని జిల్లా పరిశ్రమశాఖ అధికారులు ఆదేశించారు. ధాన్యం మిల్లింగ్ ద్వారా వచ్చే ప్రధాన బై-ప్రొడక్ట్ బియ్యం పొట్టు ద్వారా రైస్ బ్రాన్ ఆయిల్ తయారీ, పశువుల ఆహారం, బ్రాన్ ఆధారిత సబ్బులు, కాస్మెటిక్స్ తయారు చేయొచ్చు అన్నారు. పగిలిన బియ్యంతో (బ్రోకెన్ రైస్) బియ్యం పిండి, బియ్యం స్నాక్స్ మురుగులు, పాపడ్స్, రైస్ క్రాకర్స్ తయారు చేయవచ్చు అన్నారు. అలాగే బీర్, ఆల్కహాల్ తయారీకి రా మెటీరియల్ గా ఇది ఉపయోగపడుతుందన్నారు. బియ్యం తొక్క (ఊక) బయోమాస్ ఎనర్జీ, సిలికా ఎక్స్‌ట్రాక్షన్ పరిశ్రమలకు వినియోగించ వచ్చుఅన్నారు. వరి గడ్డి పశువుల ఆహారం, బయోగ్యాస్ ఉత్పత్తి, పేపర్, కార్డ్‌బోర్డ్ తయారీ వంటివి తయారు చేయడం జరుగుతుందన్నారు. రైస్ బ్రాన్ ఆయిల్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ ఉందన్నారు. మిల్లర్లు గ్రూపుగా ఏర్పడి బై-ప్రొడక్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకుంటే ఖర్చు తగ్గుతుందన్నారు. తద్వారా వినియోగదారులకు కూడా అందుబాటు ధరలో ఉత్పత్తులను విక్రయించడానికి విసులుబాటు కలుగుతుందన్నారు. రైస్ బ్రాన్ ఆయిల్, సిలికా, బయోమాస్ పెల్లెట్స్‌కు విదేశీ మార్కెట్ ఉందని , పశ్చిమగోదావరి జిల్లాలో సిలికా క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు సమావేశంలో ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుండి ఎమ్. ఎస్.ఎం.ఇ, నాబార్డు, ఫుడ్ ప్రాసెసింగ్ మినిస్ట్రీ నుండి సబ్సిడీలు, రుణాలు పెద్ద ఎత్తున పొందవచ్చు అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో అభివృద్ధి పదంలో ముందుకు వెళుతోందన్నారు. మన జిల్లాలో పెట్టుబడిదారులకు, యువ వ్యాపారవేత్తలకు గాని కొదవలేదని వారిని ఒక వేదిక పైకి తీసుకువచ్చి నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం అందించి యూనిట్ల స్థాపన ద్వారా జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో 207 రైస్ మిల్లుల వరకు ఉన్నాయని, మిల్లుల యజమానులను క్లస్టర్ గా ఏర్పాటు చేసి వారికి రైస్ ఆధారిత ఉప ఉత్పత్తుల పై అవగాహన కల్పించి యూనిట్ల స్థాపన ద్వారా మరింత జిడిపి సాధించవచ్చు అన్నారు. రైస్ మిల్లర్లు నూతన ఆలోచనలతో కొత్త టెక్నాలజీని అందుపుచ్చుకొని జిల్లా పారిశ్రామిక ప్రగతిలో భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలో ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కలిగిందని ఆర్గానిక్ ఉత్పత్తులపై మిల్లర్స్ రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లా పారిశ్రామిక అభివృద్ధి చెందాలంటే రైస్ మిల్లర్స్ బై ప్రొడక్ట్స్ ద్వారా ముందుకు వెళ్లాలన్నారు. నూతన ఉత్పత్తుల ఉత్పత్తుల తయారీకి రైస్ మిల్లర్ రైస్ మిల్లర్లు ముందుకు రావాలని అందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించడానికి జిల్లా యంత్రాంగం ముందుంటుందన్నారు. తొలుత రైస్ ద్వారా తయారు అయ్యే వివిధ ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు పరిశీలించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సూరిబాబు, ఎన్ ఆర్ డి ఎన్ ఆర్ డి సి ప్రతినిధి శాంతన్, క్లస్టర్ కన్సల్టెంట్ ఫణి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎం.డి ఇబ్రహీం, డీఎస్ఓ ఎన్ సరోజ, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, విశాఖపట్నం ఎన్ఆర్డిసి జూనియర్ సైంటిఫిక్ మేనేజర్ జి.శంతను కుమార్, క్లస్టర్ కన్సల్టెంట్ ఫణి, లలిత ఇండస్ట్రీస్ శ్రీనివాస్, ఈస్ట్ గోదావరి ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఏఎస్ఓ రవిశంకర్, రైస్ మిల్లుల యజమానులు, ఎం ఆర్ ఎం ఎస్ ఎం ఈ ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కాశినాయన మండలంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ:

### 13 మందిపై కేసు నమోదు

### వాహనాలు స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు





**కాశినాయన, ఫిబ్రవరి 7 (నంది పత్రిక):**కాశినాయన మండలం మూలపల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా సాగుకు సిద్ధం చేస్తున్న వారిపై రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ అక్రమ ఆక్రమణకు సంబంధించి మొత్తం 13 మందిపై కేసు నమోదైనట్లు ఎస్సై పి. యోగీంద్ర తెలిపారు.

**సంఘటన వివరాలు:** గత కొద్దిరోజులుగా మూలపల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిని కొంతమంది రైతులు ఆక్రమించి టిప్పర్లు, జెసిబిలు మరియు హిటాచీలతో చదును చేస్తున్నారన్న పక్కా సమాచారంతో, ఈ నెల 5వ తేదీ (05-02-2026) నాడు ఆర్డీఓ, తహశీల్దార్ మరియు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అధికారులు వెళ్లే సమయానికి అక్కడ యంత్రాలతో భూమిని చదును చేస్తున్న దృశ్యం కనిపించింది. వెంటనే స్పందించిన అధికారులు అక్రమంగా వినియోగిస్తున్న రెండు హిటాచీలు, ఒక జెసిబి మరియు ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**కేసు నమోదైన నిందితుల జాబితా:** ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేస్తున్నారనే తహశీల్దార్ ( ఎంఆర్ఓ) ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ క్రింది వారిపై కేసు నమోదు చేశారు:

బసిరెడ్డి భాస్కర్ రెడ్డి (గంగానపల్లి) బసిరెడ్డి ఓబుల్ రెడ్డి (గంగానపల్లి)
బసిరెడ్డి రవీంద్రారెడ్డి (గంగానపల్లి) అంబావరం చంద్రశేఖర్ రెడ్డి (గంగానపల్లి)
పాణ్యం పీరయ్య (గొంటువారిపల్లి) పంగా వెంకటకృష్ణారెడ్డి (గంగానపల్లి)
రామాపురం భాష (గంగానపల్లి) బసిరెడ్డి వెంకటరెడ్డి (గంగానపల్లి)
పబ్బతి సాల్మన్ (నర్సాపురం) కొండా రామ సుబ్బారెడ్డి (గంగానపల్లి)
ఎర్రబల్లి ఎల్లయ్య (మిద్దెల) బోవిల్ల చంద్రశేఖర్ రెడ్డి (నరసాపురం) అఫ్రోజ్ (కలసపాడు)

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు

## పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ సమయంలో అధికారులు రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలి.



**ప్రభుత్వం రాజ ముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ పట్ల ఆనందం వ్యక్తం చేసిన రైతులు.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**తణుకు చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 7 నంది పత్రిక** తణుకు మండలం తేతలి గ్రామ పంచాయతీ వద్ద శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ సమయంలో అధికారులు రైతులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకంలో అన్ని వివరాలు సక్రమంగా ఉన్నది, లేనిది చూసుకున్నారా, లేదా అడిగి తెలుసుకున్నారు. అన్ని సక్రమంగానే ఉన్నాయని, రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ పట్ల తమ ఆనందం వ్యక్తం చేశారు. గ్రామానికి బయట ఉన్న రైతులకు ఫోన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏకీకృత కుటుంబ సర్వే ఏ విధంగా జరుగుతున్నది పరిశీలించి సర్వే , ఈ కేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ



సందర్భంలో ఆర్డిఓ ఖైతిబ్ కైసర్ భానో, తణుకు తహసిల్దార్ డి.అశోక్ వర్మ, ఎంపీడీవో లోహిత్ సాగర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రివర్యులకు ఆహ్వానం

**శ్రీశైలం ఫిబ్రవరి 07(నంది పత్రిక)** శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 8 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా (07.02.2026) ముఖ్యమంత్రివారి కార్యాలయములో గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారాచంద్రబాబునాయుడు గారిని కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. శ్రీశైలం నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు శ్రీబుడ్డారాజశేఖరరెడ్డి, దేవదాయ కమిషనరు శ్రీ కె.రామచంద్రమోహన్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు గౌరవ ముఖ్యమంత్రి వారిని కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం తరుపున ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రచురించబడిన కాఫీటేబుల్ పుస్తకమును ముఖ్యమంత్రివర్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో ముఖ్యమంత్రి వర్యులకు వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలు, శ్రీస్వామిఅమ్మవార్ల జ్ఞాపిక అందజేయడం జరిగింది.



# కల్లూరు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం





### 16 వార్డుల అభివృద్ధి పనుల సమీక్షలో ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

### 340-సి రహదారి విస్తరణకు టిడిఆర్ ప్రక్రియ వేగవంతం

### తాగునీరు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధిపై దృష్టి

**కర్నూలు నంది పత్రిక.....** కర్నూలు నగర పరిధిలోని కల్లూరు అర్బన్ ప్రాంత సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి కల్లూరు 16 వార్డుల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య కూడలి నుంచి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు 340–సి రహదారి విస్తరణ పనులకు సంబంధించి టిడిఆర్‌ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో ఆక్రమణకు గురైన పార్కును పరిరక్షించాలని, వీధి దీపాల మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని, వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయ వద్ద రహదారిపై ఉన్న షాపులను తొలగించాలని పేర్కొన్నారు. సచివాలయాల్లో కనీస సిబ్బంది నియమించాలని, పని వేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని, అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వక్ఫ్ బోర్డు స్థలాలకు పన్నులు విధిస్తున్న అధికారులపై విచారణ చేపట్టాలని సూచించారు. ధనలక్ష్మి పార్కుతో పాటు పెండింగ్‌లో ఉన్న పార్కులను అభివృద్ధి చేయాలని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల మార్పునకు స్థలం చూపించాలని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి వీలైనంత ఎక్కువగా నీరు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.ఎమ్మెల్యే, వివిధ వార్డుల నాయకులు లేవనెత్తిన సమస్యలకు కమిషనర్ వివరణ ఇస్తూ చట్టపరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని తెలిపారు. పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, సమస్యల పరిష్కారానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని, ప్రతి పౌరుడు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ఆర్వోలు జునైద్, వాజీద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, డిఈఈలు, ఏఈలు, శానిటేషన్ ఇంస్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ పర్యటన.

### బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తాం

### ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహార్.





**కర్నూలు, నంది పత్రిక.....** కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న దుర్ఘటన నేపథ్యంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కాస్ట్స్ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహార్ శనివారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాధితుడు టి.యం. రమేష్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ధైర్యపరిచారు.ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రావలసిన అన్ని రకాల పరిహారాలు, సంక్షేమ పథకాల లబ్ధి తక్షణమే అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రమేష్ మృతి చాలా బాధాకరం బాధితులకు పూర్తి న్యాయం చేయడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంతో పాటు సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దర్యాప్తు వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా పోలీస్ శాఖ సమర్థంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలగే ఎస్సీ అట్రాసిటి కేసులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.అదేవిధంగా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామ స్థాయిలో సామాజిక అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేసి బాధిత కుటుంబానికి భద్రత, మానసిక ధైర్యం కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ గౌతమ్ రాజు, రామాంజినమ్మ, బాబు, ఆర్డీవో భరత్ నాయక్, డీఎస్పీ వెంకట రామయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, నాయకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఈఎన్‌సిగా రమేశ్ బాబు నియామకం

ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటో రియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజినీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు. సాధారణంగా కీలకమైన స్థానం ఖాళీ అవుతుంటే ముందుగానే తాత్కాలికంగానైనా ఇన్‌చార్జిని నియమించడం పరిపాటి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజులైనా భర్తీ చేయకపోవడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. అయితే ఈఎన్సీ జనరల్ స్థానం భర్తీ కాకపోవడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి.

## బనగానపల్లె పట్టణంలో నగల దుకాణంలో చోరీ

### 40 తులాల బంగారు 12 కేజీల వెండి అపహరణ

### వరుస చోరీలతో భయాందోళనలతో పట్టణ ప్రజలు



**బనగానపల్లె ఫిబ్రవరి 7 నంది పత్రిక** బనగానపల్లె పట్టణంలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. గతంలో కర్నూలు రహదారిలో ఉన్న బిసి కాలనీలో ఒక ఉపాధ్యాయుడు ఇంటికి తాళం వేసి వెళ్ళగా తాళం పగుల కొట్టి బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఇదిలా ఉండగా శుక్రవారం అర్ధరాత్రి పాత పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న శ్రీనివాసా జ్యువెలర్స్ అనే నగల దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడి దోపిడీ చేశారు. నగల దుకాణం కు తాళం వేసి ఉన్నప్పటికీ షాపు తాళాన్ని పగలగొట్టి దుండగులు దుకాణంలోకి ప్రవేశించి దుకాణంలో ఉన్న 40 తులాల బంగారు నగలు, 12 కేజీల వెండిని దోచుకెళ్లినట్టు నగల షాపు యజమాని గోవిందు వాపోయారు. ఈ దుకాణము పాత పోలీస్ స్టేషన్ ప్రక్కన కమాండ్ల వద్ద పోలీస్ స్టేషన్ పక్కనే ఉండడం గమనార్హం. వరుస చోరీలతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. పోలీసులు ఈ చోరీలపై గట్టి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## అనధికారిక భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు.

### ఆగష్టు 31 ముందు అనధికారిక భవన నిర్మాణాలను బి.పి.ఎస్. తో క్రమబద్ధీకరణ చేసుకోండి.. కమిషనర్ ఎన్.మౌర్య.

**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 7 నంది పత్రిక** ఆగష్టు 31 వ తేదీ ముందు నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన అనధికారిక భవన నిర్మాణాలను బి. పి. ఎస్. ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, అనుమతులు లేకుండా నగరంలో భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. నగరంలో అనధికారిక భవన నిర్మాణాలు, బి. పి. ఎస్. దరఖాస్తుల పరిష్కారంపై శనివారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగష్టు 31 వ తేదీ తరువాత జరుగుతున్న అన్ని భవన నిర్మాణాలపై శాటిలైట్ నిఘా ఉందని తెలిపారు. ఈ మేరకు ఏవరైనా నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు, అదనపు అంతస్థుల నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 31వ తేదీ లోపు ఏవైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగి ఉంటే బిపిఎస్ ద్వారా క్రమబద్దీకరణ చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తులను ఎప్పటికప్పుడు కూల్చివేస్తున్నామని తెలిపారు. అనధికారిక నిర్మాణాల పట్ల అశ్రద్దగా వ్యవహరించిన ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలను కూడా సస్పెండ్ చేశామని తెలిపారు. అనధికారిక నిర్మాణాల పట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆగస్టు 31 కి ముందు నిర్మించిన భవనములు మరియు అపార్ట్మెంట్ ఫ్లాట్లు గుర్తించి 995 మంది యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 1033 బి.పి.ఎస్. దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బి.పి.ఎస్ దరఖాస్తుల పరిష్కారం లో ఏమైనా సమస్యలు ఉన్న యెడల తనను నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో డిసిపీ ఖాన్, ఏసీపీలు పార్వతి ప్రియ, మూర్తి, తదితరులు ఉన్నారు.



## ఫిబ్రవరి 9వ తేదీ సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించాల్సిన పీజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు..

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 7 నంది పత్రిక** ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం ఫిబ్రవరి 9న రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించనున్న వర్చువల్ కలెక్టర్ కాన్ఫరెన్స్ కు జిల్లాలోని అధికారులు అందరూ హాజరు కావలసి ఉన్నందున పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఫిర్యాదులు అందజేయడానికి ఎవరు జిల్లా కలెక్టరేట్, డివిజన్, మండల కార్యాలయాలకు రావద్దని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య.



**నందికొట్కూరు ఫిబ్రవరి 7(నంది పత్రిక )** సీఎం సహాయనిది లేదా బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు పొందేందుకు ఎంతో ప్రోత్సాహకరముగా దోహదపడుతుందని, ప్రభుత్వం సహాయం కోరిన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సీఎం సహాయనిది అందజేస్తూ ప్రజా సంక్షేమ మే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే తక్కుతుందని, ఈ పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే గిత్తజయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎం సహాయనిది కొరకు ప్రభుత్వమునకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన 4,66,651 లక్షల రూపాయల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిత్త జయసూర్య చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన అయ్యన్న 71922( కోనేటమ్మ పల్లె) సరస్వతమ్మ 32466( కోల్ల బావాపురం ) కావేటీ మహేశ్వరి 20541, తోకల లలితమ్మ 32100, మరియు దామగట్ల గ్రామానికి చెందిన మద్దిలేటి 30000, బోయ సుబ్బమ్మ 30000, నందికొట్కూరు పట్టణానికి చెందిన బోయ శ్యామల 20084, చాకలి స్వర్ణకుమార్ 30541, శీలం శిరీష 30541, పింజారీ అలింబి 32255, పక్కిరి సీతమ్మ 105000, శీలం మంజుల 31084 మంజూరైన సీఎంఆర్ ఫ్ చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయ సూర్య లబ్ధిదాలకు తన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం లబ్ధిదారులు కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, బ్రాహ్మణ కొట్కూరు సొసైటీ ఛైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ రెడ్డి, నందికొట్కూరు సొసైటీ ఛైర్మన్ ముర్తుజవాలి, టిడిపి పట్టణ కన్వీనర్ మరియు కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, టిడిపి తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మద్దిలేటి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు అందుబాటులోకి

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 07(నంది పత్రిక):-** క్యాబ్ బుక్ చేసుకున్నంత సులభంగా వ్యవసాయ అవసరాల కోసం డ్రోన్ సేవలను వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో డ్రోన్ సేవలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న “యుబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్” యాప్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డ్రోన్ సేవలను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ డ్రోన్ సేవల ద్వారా పురుగుమందులు, ఎరువులు, విత్తనాలను వ్యవసాయ భూములపై చల్లే సౌకర్యం ఉందని, దీని వల్ల సమయం, కూలీల వ్యయం గణనీయంగా ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఒకే యాప్‌లో అనేక వ్యవసాయ సేవలు పొందే వీలుందని తెలిపారు. రైతులకు మరింత సౌలభ్యం కల్పించే దిశగా, ప్రతి ప్రాంతంలో అద్దెకు డ్రోన్ సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్రిప్రమాదంపై కేటీఆర్ అనుమానాలు

హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగులను, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేకపోవడాన్ని కప్పిపుచ్చేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందిస్తూ... ల్యాబ్ మొత్తం కాలిపోతోందని, ఏయే ఆధారాలు నాశనం చేశావు అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రమాదం వివరాల్లోకి వెళితే... ల్యాబ్ లోని తొలి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే భవనంలోని ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించాయి. అగ్నిప్రమాదం కారణంగా ల్యాబ్ లోని కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన. ....ఎమ్మెల్యే





**మండలంలోని వివిధ గ్రామాల బాధితులకు**
**రూ 235713ల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ.**
**బాధితులు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి... గీత్త.**

జూపాడుబంగ్లా ఫిబ్రవరి:07 :( నంది పత్రిక ): మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని అనారోగ్య బారినపడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి స్థానిక ఎమ్మెల్యే సిఫారసుతో మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయ సూర్య బాధితులకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు . తుడిచెర్ల గ్రామానికి చెందిన దండల హరికృష్ణ బాధితుడు కి రూ 25024ల చెక్కును అలాగే జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన కాటే పోగు ఇందిరమ్మకు రూ 32028లు, మరియు తంగడంచ గ్రామానికి చెందిన గువ్వల శ్రీనివాసులు కు రూ 13301 ల చెక్కును అందజేశారు. అలాగే 80 బన్నూరు గ్రామానికి చెందిన అహల్య సిద్దిరెడ్డి రూ 42919లు, పారుమంచాల గ్రామానికి చెందిన సన్నగి ఈశ్వరమ్మ కు రూ 41441 లు, మండ్లేము గ్రామానికి చెందిన ప్రభుదాస్ కు రూ81000 లు టిడిపి మండల నాయకులతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ వివిధ రోగాల బారిన పడి ఆర్థికంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం చేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందజేసిన నిధులను తమ ఆరోగ్యలకే ఖర్చు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్ల యాదవ్, మండల టిడిపి కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి , పోతులపాడు మాజీ గ్రామ సర్పంచ్ రవికాంత్, జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, తర్తూరు దేవాదాయ కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి, జంగాల పెద్దన్న, పారుమంచాల దేవ సహాయం, లక్ష్మణ్ గౌడ్, వీరారెడ్డి, కృష్ణారెడ్డి, గోరే సాహెబ్, పరమేశ్వర్ రెడ్డి, మందడి దొరబాబు రెడ్డి, మాజీ ఎంపీపీ మందటి వెంకటరమణారెడ్డి, రమణారెడ్డి,రామ్మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రవి కుమార్ యాదవ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి ప్రసన్న, తాటిపాడు కృష్ణారెడ్డి,తుడిచెర్ల రాముడు, తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# శ్రీశైలం దేవస్థానంలో మహాశివరాత్రి ఏర్పాట్లు





శ్రీశైలం ఫిబ్రవరి 07(నంది పత్రిక) ఈ సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 08.02.2026 నుండి 18.02.2026 వరకు 11 రోజులపాటు నిర్వహింపబడనున్నాయి. ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 9.00 గంటలకు యాగశాల ప్రవేశముతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 18 తేదీన రాత్రి జరిపే పుష్పోత్సవ, శయనోత్సవాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

**ముఖ్య కార్యక్రమాలు** : 08.02.2026 - ధ్వజారోహణ, 09.02.2026 - భృంగివాహనసేవ, 10.02.2026 - హంసవాహనసేవ, 11.02.2026 - మయూరవాహనసేవ, 12.02.2026 - రావణవాహనసేవ 13.02.2026 - పుష్పపల్లకీసేవ 14.02.2026 గజవాహనసేవ 15.02.2026 - మహాశివరాత్రి ప్రభోత్సవం నందివాహనసేవ, లింగోద్భవకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పాగాలంకరణ స్వామిఅమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణం 16.02.2026 - రథోత్సవం తెప్పోత్సవం 17.02.2026 యాగ పూర్ణాహుతి, ధ్వజావరోహణ 18.02.2026 - అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం

**పట్టువస్త్రాల సమర్పణ** : 08.02.2026 - శ్రీ కాళహస్తీశ్వరస్వామివార్ల దేవస్థానం, శ్రీకాళహస్తి 09.02.2026 శ్రీ వేంకటేశ్వర స్వామివార్ల దేవస్థానం, ద్వారకా తిరుమల 10.02.2026 - శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, విజయవాడ 11.02.2026 ఉదయం - శ్రీవరసిద్ధివినాయకస్వామివార్ల దేవస్థానం కాణిపాకం సాయంకాలం తిరుమల తిరుపతి దేవస్థానం 12.02.2026 రాష్ట్ర ప్రభుత్వం

**చలువ పందిర్లు** : శివదీక్షాశిబిరాలు, టోల్‌గేట్ సమీపంలోగల బసవవనం, సిబ్బంది వసతి గృహాల వద్దగల బాలగణేశ వనం, ఆలయదక్షిణభాగంలో గల రుద్రాక్షవనం, శివాజీగోపురం ఎదురుగా గల శివాజీపార్కు, తెలుగు విశ్వవిద్యాలయం సమీపంలో గల రుద్రాపార్కు, మల్లమ్మకన్నీరు మొదలైనచోట్ల చలువ పందిర్లు వేసి భక్తులు సేద తీరేందుకు అవకాశం కల్పించబడుతుంది. సాక్షిగణపతి, పార్కింగ్ ప్రదేశాలు, అన్నదానభవనము, కల్యాణకట్ట,చండీశ్వరసదనం మొదలైన ఆరుబయలు ప్రదేశాలలో కూడా చలువపందిర్లు వేయబడ్డాయి. దాదాపు 13 ఎకరాల విస్తీర్ణములో ఈ చలువపందిర్లు ఏర్పాటు చేయబడ్డాయి.

**ఆర్జితసేవలు మరియు దర్శనములు** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో అనగా 08.02.2026 నుండి 18.02.2026 వరకు అన్ని ఆర్జిత సేవలు మరియు పరోక్షసేవలు నిలిపివేయబడ్డాయి. ఈ ఉత్సవ రోజులలో భక్తులకు శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుంది. అయితే జ్యోతిర్ముడి కలిగియున్న శివదీక్షాభక్తులకు మాత్రం ఉత్సవాలలో అయిదు రోజులపాటు అనగా 08.02.2026 నుండి 12.02.2026 వరకు నిర్ణీత వేళలలో శ్రీ స్వామివారి స్పర్శ దర్శనమునకు అవకాశం కల్పించబడింది. ఉత్సవాలలో తేది : 13.02.2026 రాత్రి గం.7.30 నుండి 18.02.2026 రాత్రి వరకు శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం పూర్తిగా నిలిపి వేయబడుతుంది.

**విరామదర్శనం** ఉత్సవ రోజులలో తేదీ : 08.02.2026 నుండి 18.02.2026 వరకు ప్రముఖులకు విరామ దర్శన వేళలో మాత్రమే దర్శనం కల్పించబడుతుంది. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ విరామ దర్శనం ఏర్పాటు చేయబడింది. **మొదటి విడత** : ఉదయం గం. 6.30 ని. ల నుంచి గం. 7.30 ని. ల వరకు

**రెండవ విడత** : మధ్యాహ్నం గం. 12.30 ని. ల నుంచి గం. 1.00ని.ల వరకు

**మూడవ విడత** : రాత్రి గం. 07.00 ని. ల నుంచి గం. 7.30 ని. ల వరకు

**క్యూలైన్లు** భక్తుల సౌకర్యార్థం మూడు క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఉచితదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేయబడుతాయి. ఉచితదర్శన క్యూలైను రథశాల నుంచి ప్రారంభమవుతుంది. రథశాల వద్ద నుంచి క్యూలైన్లలో ప్రవేశించిన ఉచిత సర్వదర్శనం భక్తులకు క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయ ప్రవేశం కల్పించబడుతుంది ఈ సర్వదర్శనం భక్తులకు క్యూ కాంప్లెక్స్ నందు వేచి వుండేందుకువీలుగా మొత్తం 20 కంపార్టుమెంట్లలో ఆయా ఏర్పాట్లను చేయడం జరుగుతుంది. శీఘ్రదర్శనం (రుసుము రూ.200/-లు) క్యూలైను క్యూకాంప్లెక్సు కుడివైపున (క్యాంటిన్ భవనం తొలగించిన చోట) నుంచి ప్రారంభమవుతుంది. అతిశీఘ్రదర్శన క్యూలైన్ (రుసుము 500/-లు) క్యాంపుకోర్టు భవనము నుండి ప్రారంభమవుతుంది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లుల క్యూలైన్ ఉమరామాలింగేశ్వరస్వామి ఆలయం ముందు నుంచి ప్రారంభమవుతుంది. ఈ క్యూలైన్ల ద్వారా వచ్చే భక్తులు వేచివుండేందుకు క్యూకాంప్లెక్స్ నందు మొత్తం 8 కంపార్టుమెంట్లలో ఆయా ఏర్పాట్లు చేయబడుతున్నాయి. క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు నిరంతరం అల్పాహారం, బిస్కెట్లు, మంచినీరు అందించబడుతుంటాయి. అదేవిధంగా క్యూలైన్లలో కూడా భక్తులకు నిరంతరం మంచినీరు అందించబడుతుంది.

# క్యాంపు కార్యాలయంలో మంత్రికి ప్రజా వినతులు





బనగానపల్లె ఫిబ్రవరి 7నందిపత్రిక రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డికి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజలనుండి వినతులు వెళ్లువెత్తాయి. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించిన మంత్రి ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ అర్జీలు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. అదే సమయంలో న్యాయబద్ధమైన అంశాలపై అక్కడిక్కడే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో రెవెన్యూ సమస్యలు, నూతన పింఛన్లు ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలకు సంబంధించిన విజ్ఞప్తులు ఎక్కువగా వచ్చినట్లు సమాచారం అయితే మంత్రి ఆయా సమస్యలను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. దింతో మంత్రి అర్జీలపై స్పందించిన తీరుకు బాధితుల నుంచి ఆనందం వ్యక్తమైంది.

# 15వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు లక్ష్యంగా విస్తృత ప్రచారం.





కేసముద్రం, ఫిబ్రవరి 07(నంది పత్రిక):కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో బిఆర్ఎస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గుగులోత్ సునీత వీరు నాయక్ గెలుపు లక్ష్యంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనను అంచనా వేసుకోవాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ముఖ్యంగా రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక అవస్థలను గుర్తించాలని, కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడానికి ఓటు ద్వారా బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలంటూ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో కేసముద్రం స్టేషన్ ఎంపీటీసీగా పనిచేసిన అనుభవంతో తనను గెలిపిస్తే 15వ వార్డ్ అభివృద్ధిని చేసి చూపెడతానని హామీ ఇస్తూ అధిక మెజారిటీతో గెలిపించాలని ఓటును అభ్యర్థిస్తున్నారు.



# బిఆర్ఎస్ లో చేరిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ శ్రీనివాస్ రెడ్డి.



కేసముద్రం, ఫిబ్రవరి 07(నంది పత్రిక):కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ సమక్షంలో కాంగ్రెస్ ను వీడి బిఆర్ఎస్ లో చేరారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సామ శ్రీనివాస్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రస్తుతం జరుగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడానికి శతవిధాల ప్రయత్నాలు, కుట్రలకు పాల్పడుతుందని, ప్రజలందరూ బిఆర్ఎస్ వైపు చూస్తున్నారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కృషిచేసి అమ్మినాపురం పరిధిలోని ఐదు, ఆరు వార్డు కౌన్సిలర్లను గెలిపించుకోవాలని సూచించారు. ఇందుకు కృషి చేసిన అమీనాపురం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్, ఇంటికన్నె ఉపసర్పంచ్, మండల బిఆర్ఎస్ నాయకులు గణపారపు రమేష్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు సోలాపురపు యాకూబ్ రెడ్డి, సీనియర్ ఉద్యమ కళాకారులు తరాల సంపత్, సోషల్ మీడియా కన్వీనర్ తరాల విజయ్ లను శంకర్ నాయక్ అభినందించారు.

# భద్రాద్రికి ఏం చేశారని ఓట్లు వేయాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి ఏం చేశారని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూటిగా ప్రశ్నించారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 53,54,29,30 వార్డుల్లో ప్రచారం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ తప్పుడు హామీలతో అధికారులకు వచ్చిందని, రెండేళ్లయినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. కేవలం కేసీఆర్ కుటుంబాన్ని తిట్టుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు.

# లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం ప్రశంసనీయం: మామిడి అశోక్



కేసముద్రం, ఫిబ్రవరి 07(నంది పత్రిక):కేసముద్రం మండలం లోని కోరుకొండపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమం లో క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ మాట్లాడారు. లయన్స్ క్లబ్ పాస్ట్ జెడ్సీ యర్నం శ్రీరాములు కూతురు సౌజన్య పుట్టినరోజు సందర్భంగా 60 మంది విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, మిఠాయిలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న పిల్లలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, ఆరోగ్యంపై అవ గాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భవి ష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని, సమాజహితమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని మామిడి అశోక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ జడ్సీ చిర్ర యాకాంతం గౌడ్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, శామకూరి నర్సయ్య, చింత కరుణాకర్ హెడ్మాస్టర్ మాదాసిరాజన్న,ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఎస్.రఘు ప్రసాద్, ఎస్.రమేష్ పాల్గొ న్నారు.

# స్కూల్ బస్సులో మంటలు.. పిల్లకు తప్పిన ప్రాణాపాయం

చిట్యాల మండలం చల్ల గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. అయితే, ప్రమాద సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు ఉన్నారు. డ్రైవర్, గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై పిల్లల్ని బస్సు నుంచి కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.

# మాత "రమాబాయి అంబేద్కర్" కు ఘనంగా నివాళి అర్పించిన మాల మహానాడు నాయకులు.




నందికొట్కూరు ఫిబ్రవరి 7( నంది పత్రిక) భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని పివి రావు మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలు వేసి నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పివి రావు మాలమహానాడు అధ్యక్షులు డాక్టర్ డి వెంకటేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించడానికి, దేశానికి ఆయన చేసిన సేవలలో రమాబాయి అంబేద్కర్ త్యాగం మరువలేనిది వారు కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం కొరకు పోరాటంలో ఆమె ఎంతో దోహబడ్డారని, ఆమె పట్టుదల ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పివి రావు మాల మహానాడు నాయకులు చెరుకు నడిపిన బండారు శ్రీనివాసులు, ఆరే రాజు, చెరుకు శేఖర్, మధు, మల్రెడ్డి రవికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కెకె కుమారుడికి బెదిరింపులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంకట్

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు కుమారుడు వెంకట్‌పై కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. బంజారాహిల్స్ ప్రాంతంలోని ఓ ఇంటి క్రమబద్ధీకరణ వ్యవహారంలో పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ వేస్తామంటూ.. రూ.3 కోట్లు డిమాండ్ చేస్తూ కొందరు వ్యక్తులు బ్లాక్ మెయిల్ చేసినట్లు వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఓ ఇంటి క్రమబద్ధీకరణ అంశాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు కోర్టులో పిల్ వేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. రూ.3 కోట్లు చెల్లిస్తే పిల్‌ను వెనక్కి తీసుకుంటామని ప్రతిపాదన చేసినట్లు వెంకట్ తెలిపారన్నారు. ఈ డిమాండ్‌కు అంగీకరించకపోవడంతో.. మరిన్ని కేసులు వేస్తామని బెదిరిస్తూ తనపై ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదులో తెలిపారు. వెంకట్ ఫిర్యాదు మేరకు పోలీసులు సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన గడీల రఘువీరారెడ్డి, అన్వేశ్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# కాలరెగరేసేలా చంద్రన్న పాలన





## జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత

## రప్పా...రప్పా... నరుకుతామని బెదిరించడం కాదు..

## రాష్ట్రాభివృద్ధిపై చర్చకు రండి

## జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్ర సవిత సవాల్

## టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి ప్రాణహాని

## తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని ఒప్పుకోవడమే కారణం

## వచ్చే ఎన్నికల్లో కడపలో క్లీన్ స్వీప్ చేయబోతున్నాం : మంత్రి సవిత

## ఘనంగా టీడీపీ కడప కమిటీ ప్రమాణ స్వీకారం

**కడప చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 7 నంది పత్రిక** : రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కాలరెగరేసేలా పాలన సాగిస్తోందని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. రప్పా..రప్పా నరుకుతామంటూ బెదరింపు దిగడం కాదని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చకు రావాలని జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో కడపలో అన్ని అసెంబ్లీ స్థానాలను, ఎంపీ స్థానాన్ని కూడా కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుంటుందని, ఆ జిల్లాలో క్లీన్ స్వీప్ చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కడప టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కమిటీ ప్రమాణా స్వీకారం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, టీడీపీ కడప జిల్లా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన భూపేశ్ రెడ్డికి, కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. అన్న ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తరవాతే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం లభించిందన్నారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అన్ని వర్గాల వారికి ప్రాధాన్యమిస్తూ, పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్... టీడీపీని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. పార్టీలో కష్టించిన పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తోందన్నారు. కష్టకాలంలో పసుపు జెండా మోసిన వారిని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ మరిచిపోరన్నారు. పార్టీలోకి యువతకు పెద్ద పీట వేస్తున్నారన్నారు.

**కాలరెగరేసేలా చంద్రన్న పాలన** ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, సూపర్ సిక్స్ పథకాలను విజయవంతం చేశామని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఫ్రీ బస్, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు ఇలా అన్ని పథకాలను అమలు చేశామన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు కాలరెగరేసేలా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, రహదారులు, గ్రామీణ రహదారులు ఇలా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పనులు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత టీడీపీ కార్యకర్తలపై ఉందన్నారు.

**కడపలో క్లీన్ స్వీప్ చేస్తాం...** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని మంత్రి సవిత వెల్లడించారు. కడపలో టీడీపీ పటిష్టంగా ఉందన్నారు. ప్రస్తుతం కడపలో నాలుగున్నర లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. కడపలో గత సాధారణ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాల్లో అయిదు స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. ఇటీవల జరిగిన పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పసుపు జెండా రెపరెపలాడి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి గెలుపు సాధించారన్నారు. ఇదే స్పీడ్ తో వచ్చే సాధారణ ఎన్నికల్లో కడపలో క్లీన్ స్వీప్ చేస్తామని, అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ, పార్లమెంట్ స్థానంలో కూటమి విజయం సాధించడం తథ్యమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు. వైసీపీ నాయకులు ప్రజలను రప్పా...రప్పా...నరుకుతామని బెదిరించడం సరికాదని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ కు, వైసీపీ నాయకులకు సత్తా ఉంటే కూటమి ప్రభుత్వ పాలనపైనా, రాష్ట్ర అభివృద్ధిపైనా చర్చకు రావాలని సవాల్ విసిరారు.

**వైవీ సుబ్బారెడ్డికి ప్రాణహాని** తిరుపతి లడ్డూ కల్తీ అయ్యిందని స్వయంగా టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అంగీకరించారని మంత్రి సవిత తెలిపారు. వెంకన్న ప్రసాదం కల్తీ అయ్యిందని లోకమంతా కోడై కూస్తుంటే జగన్, ఆయన బ్యాచ్ మాత్రం బుకాయిస్తున్నారని విమర్శించారు. తిరుమల ప్రసాదం కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి అంగీకరించడంతో, వైసీపీ నాయకులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదన్నారు. ప్రస్తుతం వైవీ సుబ్బారెడ్డికి ప్రాణ హాని ఉందని మంత్రి సవిత ఆందోళన వెలిబుచ్చారు.

**కలిసికట్టుగా టీడీపీని బలోపేతం చేయండి** జిల్లాలో టీడీపీ పటిష్టతకు చిత్తశుద్ధితో పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేశ్ రెడ్డికి, కమిటీ సభ్యులకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను కలుపుకు పోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పథకాలు, అభివృద్ధిపై విస్తృత చర్చ జరిగేలా చూడాలని తెలిపారు. అంతకుముందు నిర్వహించిన ర్యాలీలో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, కడప పార్టీ నూతన అధ్యక్షుడు భూపేశ్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు అభివాదం చేశారు. మంత్రి సవితకు, భూపేశ్ రెడ్డికి టీడీపీ శ్రేణులు భారీ గజమాలతో సత్కరించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, మాధవీరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసుల రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, డీసీసీబీ చైర్మన్ సూర్యానారాయణ రెడ్డి, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, మాజీ ఎమ్మెల్సీలు పుత్తా నర్సింహారెడ్డి, సి.నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అమీర్ బాబు, బద్వేల్ ఇన్చార్జి రితీష్ రెడ్డి, మల్లెల లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్ పలువరు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ రాష్ట్ర గిడ్డంగుల డైరెక్టర్ బాబు రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**బేతంచెర్ల ఫిబ్రవరి 7 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణం కొత్త బస్ స్టాండ్ దగ్గరున్న బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి కాంప్లెక్స్లో గల వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు,రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బేతంచెర్ల పట్టణము మరియు మండలం లోని వివిధ గ్రామాల్లోని వైసిపి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, యువకులు ఆందరూ కలిసి సంతోషంతో బాబు రెడ్డి పుట్టిన రోజువేడుకలు ఘనంగా నిర్వహించడమైనది. అధిక సంఖ్యలో ప్రజలు కూడా పాల్గొన్నారు.అనంతరం రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి మాట్లాడుతూ గ్రామాల నుంచి, పట్టణం నుంచి వచ్చిన వైసిపి నాయకులకు, కార్యకర్తలకు, యువకులకు పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న అభిమానులకు పేరు పేరునా అందరికి నా హృదయపూర్వక అభినందనలను తెలిపారు.శనివారం ఉదయం శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రం ( ప్రభుత్వ ఆసుపత్రి) లో 2వందల మంది ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బుగ్గన కుమార్ రెడ్డి, బుగ్గన నాగార్జున రెడ్డి,సూర్య బల్లని, కురువ రమేష్,మధు కుమార్, ఆకుల రమణ, చిన్నఎద్దులన్న, పకీరప్ప, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహణ.

**వెలుగోడు, ఫిబ్రవరి 07 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు వెలుగోడు మండలం ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది ఈ టాలెంట్ టెస్ట్లో విద్యార్థుల ప్రతిభను అంచనా వేయడానికి వివిధ విషయాలలో ప్రశ్నలు ఇవ్వడం జరిగింది.తెలుగు15 మార్కులు, ఇంగ్లీష్ 15 మార్కులు, హిందీ 15 మార్కులు, సోషల్ 15 మార్కులు, మ్యాథమెటిక్స్ 20 మార్కులు, భౌతిక శాస్త్రం 10 మార్కులు, జీవన శాస్త్రం 10 మార్కుల ప్రశ్నలతో చిన్న సమాధానాల టెస్ట్ జరిగింది.టాలెంట్ టెస్ట్ విజేతలు ఈ పరీక్షలో వేల్పనూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కే. పవన్ కుమార్ 72 మార్కులతో ప్రథమ స్థానం సాధించారు.వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. జైద్ ఖాన్ 68 మార్కులతో ద్వితీయ స్థానం, వేల్పనూరు పాఠశాలకు చెందిన పి. పవన్ కుమార్ 65 మార్కులతో తృతీయ స్థానం పొందారు.ఉర్దూ మీడియం పరిధి వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తహసీమ్ ప్రథమ స్థానం, షేక్ నూరుల్లా ద్వితీయ స్థానం, హెచ్.ఎం.డి ఉమర్ ఫారూఖ్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నగదు బహుమతులను నిర్వాహకులు త్వరలో ప్రకటించి అందజేమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు మండ్ల చంద్రశేఖర రెడ్డి, యాదాటి రవీంద్రుడు , మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్ఎం సయ్యద్ మొయినుద్దీన్ , ఉపాధ్యాయులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సానియాకు సన్మానం



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 7 నంది పత్రిక** కష్టపడి చదివితే విజయం వరిస్తుందని అందుకుసోనియా నే నిదర్శనం అని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దేవిశెట్టి హరీష్ బాబు ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షులు టీఎంసీ వేణుగోపాల్ పేర్కొన్నారు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రూప్ 2 ఎంపికైన సోనియాను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా శాలవా పూలమాలతో సన్మానించారు . ఈ సందర్భంగా అసిస్టెంట్ గవర్నర్ దేవిశెట్టి హరీష్ బాబు మాట్లాడుతూ.ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన షేక్ బాషా దంపతుల కుమార్తె సానియా గ్రూప్ 2 ఎంపికైందని అలాగే గ్రూప్ 1 కూడా సెలెక్ట్ కావాలని , మరల వారు ఇదే విధంగా రోటరీ క్లబ్బు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేయించుకోవాలని కోరారు, టీఎంసీ వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రూప్ 2 కు ఎంపికైన సానియా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు శ్రీ రాఘవేంద్ర జూనియర్ కళాశాల వ్యవస్థాపకులు పాపిరెడ్డి మాట్లాడుతూ సానియా మా పాఠశాల విద్యార్థి కావడం మాకు చాలా గర్వకారణం అన్నారు, ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కష్టపడి ఇష్టపడి చదివిన సానియా మిగతా విద్యార్థులందరికీ ఆదర్శప్రాయం అన్నారు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పోలేపల్లె సత్యనారాయణ, సెక్రెటరీ బైసాని రవి ప్రకాష్, మల్లేశ్వర రెడ్డి, గ్రూప్ 2 ఎంపికైన సానియా రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయని ప్రజల కోసం సేవ చేసే అదృష్టం సానియాకు దక్కిందన్నారు. ఈ సందర్భంగా సానియా మాట్లాడుతూ రాఘవేంద్ర కళాశాలలో చదవడం అదృష్టంగా భావిస్తున్నామని క్రమశిక్షణకు మారుపేరుగా రాఘవేంద్ర కళాశాల ఉందన్నారు రోటి క్లబ్బు సభ్యులందరి ఆశీర్వాదాలు ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో బద్దిశెట్టి సత్యనారాయణ, ఎలిశెట్టి సురేష్, బాలిరెడ్డి, మాటీవీ ప్రసాద్, పేరూరు విజయ్, రత్నరాజు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం ప్రశంసనీయం: మామిడి అశోక్



**కేసముద్రం, ఫిబ్రవరి 07 (నంది పత్రిక):** కేసముద్రం మండలం లోని కోరుకొండపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ మాట్లాడారు. లయన్స్ క్లబ్ పాస్ట్ జెడ్పీ యర్నం శ్రీరాములు కూతురు సౌజన్య పుట్టినరోజు సందర్భంగా 60 మంది విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, మిఠాయిలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న పిల్లలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని, సమాజహితమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని మామిడి అశోక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ జడ్పీ చిర్ర యాకాంతం గౌడ్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, శామకూరి నర్సయ్య, చింత కరుణాకర్ హెడ్మాస్టర్ మాదాసి రాజన్న, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఎస్.రఘు ప్రసాద్, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు గుర్తుంచుకో కారు గుర్తుంచుకో అంటూ బిఆర్ఎస్ ప్రచారం.



**కేసముద్రం, ఫిబ్రవరి 07(నంది పత్రిక):** కేసముద్రం మున్సిపల్ ఎన్నికల్లో గుర్తు గుర్తుంచుకో కారు గుర్తుంచుకో అంటూ బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నో హామీలతో ప్రజలకు ఆశ చూపి మోసం చేసిన కాంగ్రెస్ కు ఓటు ద్వారా బుద్ధి చెప్పి బిఆర్ఎస్ అభ్యర్థుల కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గులాబి శ్రేణులు కోరుతున్నారు. బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తామని హామీనిస్తూ ప్రజల్లో భరోసా నింపుతున్నారు.



## పాణ్యం, బనగానపల్లె రోడ్డు పనులు పరిశీలించిన మంత్రి



**బనగానపల్లె ఫిబ్రవరి 7నందిపత్రిక** పాణ్యం, బనగానపల్లె రోడ్డు పనులను రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసి జనార్దనరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరణ కోరారు. ఈ సందర్భంగా మంత్రి నిర్ణీత గడువులోనే రోడ్డు పనులు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని వారికీ సూచించారు.ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పేర్కొన్నారు.




## ఆత్మకూరు నుండి శ్రీశైలం వెళ్లే కాలినడక మార్గం, భక్తులకు సౌకర్యాల పరిశీలన.....

### భక్తుల భద్రత దృశ్య కాలినడక మార్గంలో పటిష్ట చర్యలు.

### జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి07(నంది పత్రిక):-** నంద్యాల జిల్లాలోని మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేశం నలుమూలల నుండి తరలివచ్చి ఆ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శనం చేసుకోనున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంలో భాగంగా ఆత్మకూరు నుండి శ్రీశైలంనకు వెళ్లే కాలినడక మార్గాన్ని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆత్మకూరు నుండి శ్రీశైలంనకు వెంకటేశ్వరపురం మీదుగా నాగలూటి గూడెం, వీరభద్ర స్వామి టెంపుల్, అడవిలో గల బేస్ క్యాంప్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటుచేసిన నీళ్లు, ఆహారం తదితర వసతులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నేటి నుండి వెంకటేశ్వరపురం మీదుగా శ్రీశైలంనకు వెళ్లే కాలినడక మార్గాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ మార్గంలో భక్తుల సౌకర్యార్థం ఆహారం ,నీరు తదితర సౌకర్యాలను కల్పించడంతోపాటు భక్తుల భద్రత కొరకు కాలినడక మార్గాన్ని పోలీస్ బాంబ్ డిస్పోజల్ టీం సహాయంతో తనిఖీ చేయడం జరిగిందని, జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బందిచే కాలినడక మార్గాన్ని పోలీసు స్వాధీనంలోనికి తీసుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్, ఆత్మకూరు పోలీస్ అధికారులు, ఫారెస్ట్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆదాయ వనరుగా 'చెత్త'







**స్వచ్ఛాంధ్రే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**ఇళ్ల ముంగిటకే స్వచ్ఛ రథాలు**
**పొడి చెత్తకు విలువ కట్టి 20 రకాల నిత్యావసర వస్తువులు ఇస్తున్నాం**
**తడి చెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ**
**చెత్త కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం**
**చెత్త తో సంపద సృష్టించిన ఘనత సీఎం చంద్రబాబుదే**
**జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత**
**3 స్వచ్ఛ రథాన్ని జెండా ప్రారంభించిన జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత**

చెన్నూరు/కమలాపురం, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 07 నంది పత్రిక తమ ప్రభుత్వం చెత్త ద్వారా సంపద సృష్టించి ప్రజలకు ఆదాయం మార్గం చూపించామని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శనివారం జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి వైఎస్ఆర్ కడప జిల్లా ఒక రోజు పర్యటనలో భాగంగా చెన్నూరు మండల కేంద్రంలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి మంత్రి సవిత ప్రారంభించారు. అనంతరం చెన్నూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లక్ష్యంతో ఏపీని పరిశుభ్రంగా ఉంచాలన్నది సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. దేశం లోనే ఏపీని అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి సంకల్పమన్నారు. 2014-19లోనే ఏపీలో ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు ..2024 లో అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెత్త నుండి సంపద ను సృష్టించే చర్యల్లో భాగంగా మూలనపడిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చారన్నారు. గ్రీన్ అంబాసిడర్ల చేత ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. తడి చెత్తతో సేంద్రీయ ఎరువులు సేకరించి, రైతులకు విక్రయిస్తూ పంచాయతీలకు ఆదాయం మార్గం చూపారు. పొడి చెత్తను సైతం రీ సైక్లింగ్ చేస్తూ ఆదాయ వనరుగా మార్చారు.

**పొడి చెత్తకు నిత్యావసర వస్తువులు** గ్రామాల్లో ఇంటింటి నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ప్యాకెట్లు, గాజు సీసాలు, పాత పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వంటి పొడి చెత్త సేకరణకు స్వచ్ఛ రథాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని ఇన్చార్జి మంత్రి సవిత వెల్లడించారు. ఈ రథాల ద్వారా పొడి చెత్తను కేజీల రూపంలో తీసుకుని, వాటికి విలువ కట్టి, 20 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. కేజీ ప్లాస్టిక్ విలువను రూ.20లుగా నిర్ణయించామన్నారు. ఇళ్లలో పనికిరాని పొడి చెత్తకు విలువ కట్టి నిత్యావసర వస్తువులు అందజేస్తున్నామన్నారు. చెత్తకు కూడా విలువ కట్టి, ఆదాయ వనరుగా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అంతకుముందు స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణా చైతన్యరెడ్డి నడపగా, మంత్రి సవిత పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. సేకరించిన చెత్తకు మంత్రి సవిత నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం చెన్నూరు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో కలియ తిరిగారు. అక్కడ సేంద్రీయ ఎరువు తయారీ విధానాన్ని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణా చైతన్య రెడ్డితో కలిసి మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

## గుర్తు గుర్తుంచుకో కారు గుర్తుంచుకో అంటూ బిఆర్ఎస్ ప్రచారం.





కేసముద్రం, ఫిబ్రవరి 07(నంది పత్రిక): కేసముద్రం మున్సిపల్ ఎన్నికల్లో గుర్తు గుర్తుంచుకో కారు గుర్తుంచుకో అంటూ బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నో హామీలతో ప్రజలకు ఆశ చూపి మోసం చేసిన కాంగ్రెస్ కు ఓటు ద్వారా బుద్ధి చెప్పి బిఆర్ఎస్ అభ్యర్థుల కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గులాబి శ్రేణులు కోరుతున్నారు. బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తామని హామీనిస్తూ ప్రజల్లో భరోసా నింపుతున్నారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపుతాం: బిజెపి ఎన్నికల ఇంచార్జి కుసుమ సతీష్



కేసముద్రం, ఫిబ్రవరి 07(నంది పత్రిక):కేసముద్రం మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒక్క అవకాశం బిజెపికి ఇవ్వండి అభివృద్ధి చేసి చూపుతామని బిజెపి కేసముద్రం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ కుసుమ సతీష్ అన్నారు. శనివారం బిజెపి మున్సిపల్ ఎన్నికల కార్యాలయంలో బిజెపి మండలా ధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్ అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న కేసముద్రం మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ముస్లీం మైనార్టీలకు ఇవ్వకుండా సెక్యులర్ పార్టీలుగా చెప్పుకునే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ లు విస్మరించాయని, కానీ జనరల్ స్థానంలో ముస్లీం మైనార్టీకి చెందిన మహమ్మద్ ఖాషీంకు బిజెపి అవకాశం ఇచ్చిందని, బిజెపి ముస్లిం వ్యతిరేకి అనే తప్పుడు భావాన్ని సమాజం తిరస్కరించిందన్నారు. అంతేకాకుండా మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా బిఆర్ఎస్ మార్చిందని, వారిని బూచీగా చూపి అమలుకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు హామీలను అమలు చేయకపోగా, వారి సమస్యలను గాలికొదిలి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. కేసముద్రంలో బిఆర్ఎస్ కాంగ్రెస్ లకు అవకాశమిచ్చిన ప్రజలు ఈసారి బిజెపికి అవకాశం ఇవ్వాలని కోరారు. సెక్యులర్ పార్టీలుగా చెప్పుకునే వారు ఎన్నికల్లో మాత్రం ముస్లిం వర్గాలకు అవకాశమివ్వకుండా వారిని ఓటు బ్యాంక్ గానే చూస్తున్నారని, కానీ బిజెపి ఎప్పుడూ సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ నినాదాన్ని నిజం చేసిందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందని ద్రాక్షలానే మిగిలాయని, ప్రజా అభివృద్ధి, సంక్షేమానికి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల కమలం గుర్తుకు ఓటు వేసి అధిక మేజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం జాతీయ ఎస్ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ బిజెపి అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నర్సింహా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ లాల్, లీగల్ సెల్ అధ్యక్షులు తుంపిల్ల శ్రీనివాస్, మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వరా చారి, సీనియర్ నాయకులు ఓలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఫర్టలైజర్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులను బుక్ చేయాలి



ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 7, ( నంది పత్రిక ) ఈరోజు 08-02-2026,నుండి యూరియా ఎరువుల బుకింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ములుగు జిల్లా పరిధిలోని రైతులందరూ తప్పనిసరిగా గూగుల్ ప్లే స్టోర్ నుండి సంబంధిత ఫర్టలైజర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, యాప్ ద్వారా మాత్రమే యూరియా ఎరువులను బుక్ చేసుకోవలసి ఉంటుంది.

రైతులు యాప్‌లో యూరియాను కావాల్సిన తేదిలో, తమకు సమీప డీలర్ దుకాణాల బుక్ చేసుకోగలరు, పంట ప్రకారం , ఎన్ని ఎకరాలలో చేసారూ అనే దాన్ని యూరియా ఎన్ని బస్తాలు యాప్ చూపించటం జరుగుతుంది , అలా బుక్ చేశకుని ఎరువులను పొందవచ్చు.యాప్ డౌన్‌లోడ్ చేయడంలో గానీ, బుకింగ్ ప్రక్రియలో గానీ ఏవైనా సాంకేతిక సమస్యలు (నెట్ / ఆప్ సంబంధిత సమస్యలు) ఎదురైనట్లయితే, సంబంధిత పరిధిలోనివ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)లేదామండల వ్యవసాయ అధికారి (ఎంఏవో )ను సంప్రదించాలని కోరడమైనది.

మండల వ్యవసాయ అధికారి ఫోన్ నెంబర్లు ములుగు-8977751161 వెంకటాపూర్-8977751162 మల్లంపల్లి-8712499938 ఏటూరు నాగారం-8977751142 గోవిందరావుపేట-8977751149 మంగపేట-8977751151

కన్నాయిగూడెం-8977751150 తాడ్వాయి-8977751152 వెంకటాపురము-8977751153 వాజేడు-8977751152 సంప్రదించాల్సిందిగా కోరుచున్నాము కావున ములుగు జిల్లా రైతులందరూ యూరియా ఎరువుల బుకింగ్‌ను సమయానికి పూర్తి చేసుకోవాలని తెలిపారు.

## ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు.

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్.**



ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 7( నంది పత్రిక) 2వ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలు-2026 నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు మున్సిపాలిటీకి 1వ సాధారణ ఎన్నికల లో మొత్తం 20 కౌన్సిల్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, ఎం సి ఎం సి, ఎం సి సి, ఇతర ఎన్నికల సంబంధిత పర్యవేక్షణ బృందాలను, ఎన్నికల అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు.ఎన్నికల నేపథ్యం లో ప్రజలను ప్రలోభ పెట్టే నగదు, మద్యం, కానుకల పంపిణీ, ప్రచారం, అక్రమ నగదు రవాణా, ఇతర ప్రభావిత అంశాలపై నిఘా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అంశాలు ఎవరి దృష్టిలోకైనా వచ్చినట్లయితే కంట్రోల్ రూమ్ నం.18004257109 లో ఫిర్యాదు చేయవచ్చని, ఇతర ఎన్నికల సంబంధిత సమాచారం కోసం సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో అవగాహన కార్యక్రమం



ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 7( నంది పత్రిక ) శనివారం ములుగు, మల్లంపల్లి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు 2026 మార్చిలో జరగబోయే వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావడానికి ఇంగ్లీష్ సబ్జెక్టులో పరీక్షల అవగాహన కార్యక్రమం ములుగు జిల్లా ( ఈ ఎల్ టి ఏ ) ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ములుగులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఈ ఎల్ టి ఏ జిల్లా అధ్యక్షుడు ఎండి ఖలీల్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి పాల్గొన్నారు. ఇంగ్లీషు సబ్జెక్టులో విద్యార్థులు అధిక మార్కులు ఎలా సాధించాలో మెలకువలను ఇంగ్లీష్ విషయ నిపుణులు విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థుల సందేహాలను సవివరంగా నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఎల్టా మాజీ అధ్యక్షుడు & ఏ ఎన్ ఓ శ్యామ్ సుందర్ రెడ్డి ,ఏసి జి ఈ వినోద్ కుమార్ డి సి ఈ బి సెక్రటరీ సూర్యనారాయణ, ములుగు మండల అధికారి వజ్జ తిరుపతి ,జిల్లా సమగ్ర శిక్ష అధికారులు సైకం శ్రీనివాస్ రెడ్డి ,సాంబయ్య,ఈ ఎల్ టి ఏ ములుగు మండల అధ్యక్షురాలు ఝాన్సీ, ప్రధాన కార్యదర్శి ఆంగోత్ రాజు నాయక్, ఆర్పీలు వైష్ణవి, క్రిష్ణ,పద్మ , ఆదిరెడ్డి తిరుపతి రెడ్డి , సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహణ



ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 7, ( నంది పత్రిక) మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జనరల్ అబ్జర్వర్ ఈ. గంగాధర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అనుసరిస్తూ ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టగా, అదనపు కలెక్టర్, జనరల్ అబ్జర్వర్‌లు దానిని నిశితంగా పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేస్తూ టిపోల్ పోర్టల్ ద్వారా ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు 24 మంది, ఏపిఓలు 24, ఓపిఓలు 72 మందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు సంబంధించి 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తంపారదర్శకంగా, నిష్పక్షపాతంగానిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఔటర్ బయట వరకు హైడ్రాను విస్తరించాలి

ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగురోడ్డు బయట కూడా విస్తరించాలని పలువురు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. హైడ్రా కార్యాలయంలో తొలిసారి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి గంట వ్యవధిలో 36 మంది ఫోన్ చేసి భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితమవుతున్న తీరును వివరించారు. భూ ఆక్రమణదారులను ఉపేక్షించవద్దని హైడ్రాను కోరారు. తమ ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో మురుగు చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంలో అవస్థలు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులు, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురి అవుతున్నాయని, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నడక దారి లేకుండా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దుండిగల్ మున్సిపాలిటీలోని గాగిలాపూర్‌లో రహదారులను ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రగతినగర్ వద్ద ఓ పార్కులో ఆలయం నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని, నాగిరెడ్డి కుంటలోకి మురుగు చేరకుండా చేపట్టిన డైవర్షన్ కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయని, మాదాపూర్‌లోని సున్నం చెరువు వద్ద పేరుకు వంద అడుగుల రహదారి ఉన్నా.. మొత్తం నీటి ట్యాంకర్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆయా ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్..

## అధికార పార్టీకి ఓటు... అభివృద్ధికి తోడ్పాటు

**ఎమ్మెల్యే మురళీ నాయక్.**

**బిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీలు నిర్వీర్యం: డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్.**





కేసముద్రం, ఫిబ్రవరి 07(నంది పత్రిక):అధికార కాంగ్రెస్ కు ఓటు మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటని మహబూబాబాద్ ఎంఎల్ఏ మురళీ నాయక్ అన్నారు. శనివారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో డిసిసి అధ్యక్షురాలు డాక్టర్ భూక్య ఉమా మురళి నాయక్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండలాధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, సీనియర్ నాయకులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. గత బీఆర్ఎస్ పాలనలో జిల్లాలో ఎన్ని అరాచకాలు జరిగాయో మున్సిపాలిటీ ప్రజలకు తెలుసని, మళ్ళీ ఓట్ల కోసం తిరుగుతున్న వాళ్ళకి ఓటు వేస్తే కబ్జాలకు మద్దతు తెలిపినట్లేనని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్ తీవ్రంగా విమర్శించారు. కేసముద్రం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలకులు పట్టణాల అభివృద్ధిని గాలికొదిలేశారని ఆరోపించారు. కేవలం కబ్జాల వైపే మక్కువ చూపారని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో వార్డులకు నిధులు లేక, మౌలిక వసతులు క్షీణించాయని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి కనీస సదుపాయాలు కూడా ప్రజలకు అందలేదన్నారు. ఫలితంగా మున్సిపాలిటీలు అభివృద్ధికి దూరమయ్యాయని మండిపడ్డారు. అధికార పార్టీ ప్రతినిధులను గెలిపిస్తేనే వార్డులు అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే శక్తి కలిగినదని తెలిపారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి అభివృద్ధికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధిపై నిలదీయడమే ప్రజాస్వామ్యానికి నిజమైన మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ డిసిసి అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మేకల వీరన్న యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేశ్, ఆర్టీఏ మెంబర్ రావుల మురళి, కేసముద్రం మున్సిపాలిటీ 7, 8, 9,10, 16 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, కేసముద్రం మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో సంచరిస్తున్న పెద్దపులి

సిద్ది పేట జిల్లాలోని దూల్మిట్ట మండలం కూటిగల్, భైరన్‌పల్లి శివారులో పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మద్దూర్ మండలం లధ్నూర్, అమ్మాపూర్ గ్రామాల్లో పులి.. లేగ దూడలపై దాడిచేసి చంపడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు.. పులి పాదముద్రలను పరిశీలించారు. పులి పాదముద్రల ఆధారంగా యాదాద్రి జిల్లా నుంచి సిద్ది పేటలోకి ప్రవేశించినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దూల్మిట్ట, మద్దూర్ మండలాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం వేళ బయటకు రావొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం పాదముద్రల ఆధారంగా పులి జాడ కోసం అధికారులు అన్వేషిస్తున్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com